ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

మంగళవారం 01, సెప్టెంబర్ 2026 | 16 పేజీలు



సీఎస్‌లో...

# గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం

**నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి: పివో ఐటిడిఏ**

భద్రాచలం, ఆగస్టు 31(ప్రభాతవార్త)

గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పించే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని



# రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్

**హాజరైన స్పీకర్, శాసనమండలి చైర్మన్లు**

సత్తుపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కమిటీ లైబ్రరీ చైర్మెన్‌గా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయిదయానందును ప్రభుత్వం నియమించడంతో సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్పర్సన్‌గా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి



2వ పేజీలో...

దయానందు ప్రమాణస్వీకారం చేశారు.



# రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**తహసిల్దార్లు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్**

కొత్తగూడెం, ఆగస్టు 31 ప్రభాతవార్త:

సీఎస్‌లో...





## ప్రజాసేవే పరమావధిగా..

# సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా**

**స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త

సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్‌నగర్ మీదుగా

16 లో..

# పంటల లెక్కకు.. ప్రత్యేక యాప్

## యాప్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం




- పంటల వివరాలన్నీ నమోదుకు చర్యలు
- కార్యచరణ రూపొందిస్తున్న అధికారులు
- తొలగనున్న సమస్యలు
- వాలంటీర్లతో సర్వే
- వాలంటీర్ల శిక్షణ పూర్తి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో కూడా వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుడుతుంది. ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే యూరియా వంటి ఎరువులను పొందేందుకు ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టారు. పత్తి పంట మార్కెట్లో అమ్మాలంటే ముందుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. వ్యవసాయ రంగంలో కూడా డిజిటలైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రైతులకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ తప్పడం లేదు. యాప్ లో వివరాలను నమోదు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పండించిన పంటలను లెక్కించేందుకు వివరాలను నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వము డిజిటల్ యాప్ ను రూపొందించింది.

ఈ యాప్ ద్వారా పూర్తిస్థాయిలో ఎన్ని ఎకరాలలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వాలంటీర్లను నియమించి వారి సహాయంతో డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టనున్నారు. ఇంతకుముందు కూడా రైతులు సాగుచేసిన పంటల లెక్క ఆధారంగానే ప్రభుత్వము ఎరువులు కేటాయించింది. కొనుగోళ్ల ప్రక్రియ కూడా చేసింది. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ అధికారులు

2వ పేజీలో...

## పంటల లెక్కకు ప్రత్యేక యాప్

మొదటి పేజీ తరువాయి..

ప్రతి సంవత్సరం పంటల సాగు విస్తీర్ణం వివరాలను సేకరిస్తున్నారు. ఈ లెక్కల్లో స్పష్టత లేదనే ఉద్దేశంతో కొంతమేరకు తేడాలు ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు డిజిటల్ యాప్ ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. గ్రామస్థాయి నుంచి మండలం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు స్పష్టమైన లెక్కలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే యాప్ ను రూపొందిం చింది. ఈ యాప్ ద్వారా ఈ యాప్ ద్వారా ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు స్థలం ఎక్కడ ఉంది అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సాగుచేసిన ఎకరాలతో పాటు రైతుల సంఖ్యకు సంబంధించి స్పష్టత వస్తుంది. ఈ లెక్కల ప్రకారం పంటలు ఎంత దిగుబడి వస్తాయో కూడా తెలుసుకోవచ్చు. వరి, పత్తి, కంది, వేరుశనగ, మొక్కజొన్న తది తర పంటల దిగుబడిని తెలుసుకోవచ్చు. అంతే కాకుండా ఈ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రానికి ఏ మేరకు ఎరువులను కేటాయించాలి అర్థమ వుతుంది. ఏ రకమైన పంటకు ఎరువులు ఎంత అవసరమో తెలుసుకోవచ్చు. ఇంతకు ముందు ఎరువుల కొరకు ఏర్పడి రైతులు గంటల తరబడి పొద్దస్తమానం క్యూలో నిలబడి ఒకటి రెండు ఎరువుల కష్టాలను తీసుకుని ఇంటి ముఖం పట్టేవారు. ఈ యాప్ ద్వారా సమస్యలన్నీ తొలగిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ యాప్ ప్రవేశపెట్టింది. పంటల లెక్కలను పక్కాగా లెక్కించి యాప్లో నమోదు చేయవచ్చు. ధాన్యము ఎంత దిగుబడి వస్తుందో కూడా తెలిపోతుంది. రైతు భరోసా నిధులు కూడా ఎన్ని ఎకరాలకు ఇవ్వాలో ఈ యాప్ ద్వారా స్పష్టత వస్తుంది. వాస్తవమైన రైతులకు రైతు భరోసా లభిస్తుంది. ఇక డిజిటల్ క్రాప్ సర్వే మరో ఐదు ఆరు రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్వేకు ప్రత్యేకంగా వాలంటీర్లను నియమిస్తున్నారు. వాలంటీర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ యాప్ ద్వారా ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు ఏ రైతు పొలంలో సాగు చేశారు లెక్కలు తెలుస్తాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. పంటల లెక్కింపుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం లెక్కలు ప్రారంభించి వివరాలను యాప్ లో నమోదు చేయనున్నారు.

## రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్

మొదటి పేజీ తరువాయి..




తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్గా నియమించిన ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థ వంతంగా నిర్వహిస్తూ అసెంబ్లీ లైబ్రరీ అభివృద్ధికి సభ్యులకు మెరు గైన సేవలు అందించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతనంగా లైబ్రరీ చైర్పర్సన్బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజక వర్గంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో చూరుకైన పాత్ర పోషించడంతో పాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయటంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ను ప్రభుత్వం, టిపిసిసి అధిష్టానం గుర్తించి ఇప్పటికే ఐసిడిఎస్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్గా, దిశా కమిటీ సభ్యులుగా, రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్ డైరెక్టర్గా, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులుగా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానందుకు అప్పజెప్పడం జరిగింది. అసెంబ్లీ లైబ్రరీ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ లైబ్రరీ కమిటీ సభ్యులు అధికారులు సిబ్బంది హాజరై చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయిదయానందుకుశుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ శాసనసభ లైబ్రరీని మరింత అభివృద్ధిచేసిప్రజాప్రతినిధులకు అవసరమైన విజ్ఞానం సమాచారం అందు బాటులో ఉండేలా కమిటీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానందుకు ఏఎంసీ చైర్మన్ దోమఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి మండల పట్టణ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయ కులు మహమ్మద్ కమల్ పాషా, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**బల్లి పడిన నీటితో మధ్యాహ్నం భోజనం..**

**హెచ్ఎం సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం !**

**ఏఐ వైఎఫ్ పర్యటనలో వెలుగుచూసిన ఘోరం..**

**కలుషిత ఆహారాన్ని పారబోసి కొత్త భోజనం వడ్డించిన ఉపాధ్యాయులు**



**చుంచుపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పరిధిలోని బాబు క్యాంప్ పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో సోమవారం తీవ్ర కలకలం రేగింది. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే వాటర్ ట్యాంక్లో బల్లి పడి ఉండటం, అదే కలుషిత నీటితో వంటకాలు సిద్ధం చేయడం స్థానికంగా పెద్ద దుమారాన్ని లేపింది. ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపం, వంట సిబ్బంది బాధ్యతారాహిత్యం కారణంగా వందలాది మంది పేద విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. అయితే విద్యార్థి సంఘాల అప్రమత్తత, హెచ్ఎం తక్షణ చర్యల వల్ల పెను ప్రమాదం తప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.ఏఐ వై ఎఫ్ బృందం సోమవారం ఉదయం పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించేందుకు బాబు క్యాంప్ ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఇందులో భాగంగా వంట గది, దాని పరిసర ప్రాంతాలను తనిఖీ చేస్తుండగా వాటర్ ట్యాంక్లో కూలిపో యిన స్థితిలో ఉన్న బల్లి కనిపించింది. ఆ కలుషిత నీటితోనే అప్పటికే మధ్యాహ్న భోజన వంట కాలు పూర్తయినట్లు తెలుసుకున్న ఏఐవైఎఫ్ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వంట సిబ్బంది నిర్లక్ష్యాన్ని తీవ్రంగా నిరసిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ముందు ధర్నాకు దిగారు. హెచ్ఎం తక్షణ స్పందన – తప్పిన ఘోర ప్రమాదం పాఠశాల ఎదుట ధర్నా, ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో ప్రధానోపాధ్యాయు రాలు (హెచ్ఎం) వెంటనే వంట గదికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కలుషిత నీటితో తయారు చేసిన ఆహారాన్ని వెంటనే బయట పారవేయించారు. అనంతరం నీటి ట్యాంక్ను శుభ్రం చేయించి, వేరే మంచి నీటితో మళ్లీ కొత్తగా భోజనాన్ని సిద్ధం చేయించారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి, భోజనం నాణ్యతపై నమ్మకం కలిగించడానికి హెచ్ఎమ్తో పాటు ఉపాధ్యాయు లందరూ స్వయంగా విద్యార్థులతో కూర్చొని భోజనం చేశా రు. సమయానికి కలుషిత ఆహారాన్ని గుర్తించి వడ్డించకపోవడంతో విద్యార్థులందరూ సురక్షి తంగా బయటపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందిం చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, వంట సిబ్బం దిపై ఉందని, రోజువారీ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని ఏఐవైఎఫ్ నాయ కులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్య త్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పం దించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖా పరమైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యలపై రాజీలేని యుద్ధం ప్రకటిస్తాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో రేపు జరగనున్న భారీ ప్రజాచైతన్య బహిరంగ సభ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు గట్టి హెచ్చరిక కానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రం నుంచి తరలిన ప్రతినిధుల బృందంతో కలిసి సోమవారం ఆయన మాట్లా డుతూ.. దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి వర్గాలు, రైతాంగం, శ్రామిక వర్గం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై గళమెత్తేందుకే ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తున్న పాలకుల వైఖరి ని ఎండగట్టేందుకు ప్రజలు, కార్మికులు, రైతులు, యువత ఏకతాటిపైకి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సలిగంటిశ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, సరెడ్డి పుల్లా రెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, వి పూర్ణ చందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమిల్లి సాయిబాబా, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, డి. సుధాకర్, రాజబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తుల వెలుగులో శిరీషకు నివాళి.. కుటుంబానికి ఎమ్మెల్యే జారే భరోసా

**ములకలపల్లిలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ**

**ములకలపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

ఊకే శిరీష కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని అశ్వారా వుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భరోసా ఇచ్చారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివాసీ జేఏసీ నాయకుల పిలుపు మేరకు సోమ వారం ములకలపల్లిలో అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా భారీ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. సుందరయ్యనగర్ నుంచి కొవ్వొత్తులు చేతబూని ప్రారంభమైన ర్యాలీ పాత పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగింది. అనంతరం ప్రధాన కూడలిలో శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ర్యాలీలో పాల్గొని శిరీష కుటుంబానికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. శిరీషపై దాడికి పాల్పడిన నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా కృషి చేస్తానని అన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయ వాది ఊకే రవి, సర్పంచులు కొరస చంద్రకళ, కుంజా వినోద్, తానం పద్మ, ఆదివాసీ నాయకులు కారం సుదీర్, మడకం చిరుమప్ప, గడ్డం ఉద య్ కుమార్, మడకం శ్రీను, వట్టం శ్రీను, ప్రేమ్ కుమార్, సోడే శ్రీను, కొండ్రు భాస్కర్, తాటి ప్రవీణ్, కుంజా రాంబాబు, వాడే నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, జిల్లా నాయకులు బత్తుల అంజి, మండల అధ్యక్షుడు ఎండి జహీర్, పాలకుర్తి రవి, పాలకుర్తి సునీత్, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఊకే శిరిషను హత్య చేసిన హంతకుడుని బహిరంగ ఎన్కౌంటర్ చేయాలి

**చంద్రుగొండ భారీ కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన**

**చంద్రుగొండ ప్రభాతవార్త**



ఊకే శిరీషను హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఎన్కౌంటర్ చేయాలని ఆదివాసి సంఘం నాయకులు, అన్ని పార్టీల నాయకులు కుల సంఘాల పెద్దలు, డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారా వుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చెవిటి గూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష హత్యను తీవ్రంగా ఖండిస్తూ... సోమవారం చంద్రుగొండ మండల కేంద్రంలో ఆదివాసి సంఘం ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల ముఖ్య నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, వివిధ సంఘాల నేతలు, పాల్గొని ఊకే శిరీష కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మారుమూల అటవీ ప్రాంతంలో ఓ పేద గిరిజన కుటుంబంలో జన్మించిన శిరీష తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా ఉన్నత చదువులు చదివి హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆస్ప త్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ తన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంది. అలాంటి ఆడపిల్లను కొంతమంది కామాంధులు విచక్షణారహితంగా దాడి చేసి హత మార్చడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి కామాంధుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను బహిరంగంగా ఎన్కౌంటర్ చేస్తే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ 50 లక్షల నష్టపరిహారంతో పాటు, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, డిమాండ్ చేశారు.

# సింహాద్రి శివకుమార్ హత్య కేసులో 23 మంది అరెస్ట్

**మణుగూరు,ప్రభాతవార్త,**

ఆగస్టు 31:మణుగూరు నేతాజీ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన సింహాద్రి శివకుమార్ అలియాస్ శివ దారుణ హత్య కేసులో ప్రధాన నిందితుడు జెట్ పట్ రమ్యా కాంత్ అలియాస్ జెట్టి సహా 23 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మణుగూరు డీఎస్పీ వి. రవీంద్రారెడ్డి ఈ కేసు వివరాలను వెల్లడించారు. మణుగూరు గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన శివకుమార్ గత నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఇంటీరియర్ వర్క్ చేస్తున్నాడు. అతడి వద్ద పనిచేసే కర్రీ సతీష్ చెల్లెలిని లోకేష్ అనే యువకుడు ఫోన్ ద్వారా వేధింపులకు గురిచేయడంతో శివకుమార్ జోక్యం చేసుకుని ఆ గొడవను సర్దిచెప్పాడు. దీనిని మనసులో ఉంచుకున్న లోకేష్, ఎంకే గ్యాంగ్ లీడర్ జెట్టికి విషయం తెలిపాడు.

ఈ క్రమంలో ఆగస్టు 26న సతీష్‌తో పాటు శివకుమార్‌ను చంపుతామని జెట్టి బెదిరించాడు. ఆగస్టు 27న శివకుమార్ హైదరాబాద్ నుండి మణుగూరుకు రాగా, పక్కా పథకం ప్రకారం నిందితులంతా అతడిని నేతాజీ గ్రౌండ్‌కు పిలిపించి ముకుమ్మడిగా దాడి చేసి దారుణంగా హత్య చేశారు. మృతుడి తండ్రి సింహాద్రి వీరభద్రాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో మొత్తం 27 మందిని నిందితులుగా గుర్తించారు. ఈ కేసులో 23 మంది నిందితులను అరెస్ట్ చేసి



రిమాండ్ కు తరలించినట్లు వారి వద్ద నుంచి 9 బైక్‌లు, 20 సెల్‌ఫోన్లు, ఒక కర్ర, చేతి కడియం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగతా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కొందరిపై గతంలో పేకాట, కొట్లాట, పోక్సో, దకాయిటీ వంటి కేసులు ఉన్నాయని చెప్పారు ఈ కేసులో

జెట్ పట్ రమ్యా కాంత్ అలియాస్ జెట్టి,

కందుల దినేష్,చెన్నబోయిన భరత్, తోలేం జంపయ్య అలియాస్ వందు,రాయల వినయ్,మహమ్మద్ సాధిక్,నెట్టెం వర ప్రసాద్,గనిబోయిన సాత్విక్ అలియాస్ చింటూ,గుగులోత్ రమేష్ అలియాస్ గోబి ,కొండ్రు గణేష్,నక్క రాజా అలియాస్



విక్కీ,కంగాల సాయి జగన్,ఎదలపల్లి నాగేంద్రబాబు అలియాస్ కన్ని, కొమెర చంటి, ఏనిక దినేష్,పున్నం వంశీ శివ,కొమరం హరీష్ అలియాస్ డాన్,ఇర్ప శ్రావణ్,కలబోయిన మల్లేష్,

దేవుళ్ళ దుర్గా ప్రసాద్,అక్కిరెడ్డి అభినయ్ రెడ్డి,

సోయం నరసింహారావు, ఈర్ల లోకేశ్వర్ అలియాస్ లోకేష్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవీంద్రారెడ్డి హెచ్చరించారు. మణుగూరులో గ్యాంగ్‌లు ఏర్పాటు చేసి సెటిల్‌మెంట్లు, అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదన్నారు. అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే గ్రూపుల సమాచారాన్ని ప్రజలు ధైర్యంగా పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఈ సమావేశంలో మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సైలు నగేష్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

# 36 ఏళ్ల సేవా ప్రస్థానానికి ఆత్మీయ వీడ్కోలు.

### పిఆర్ ఏఈ మలిశెట్టి పదవీ విరమణ.. ఆత్మీయ వీడ్కోలు ..ఘన సన్మానం

**ఏన్కూరు,ఆగస్టు 31, ప్రభాతవార్త :**

ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు అంతా ఒక చోట చేరారు. సాధారణంగా విధులతో సందడి కనిపించే కార్యాలయ ప్రాంగణం ఆరోజు కాస్త భిన్నంగా కనిపించింది. మూడు దశాబ్దాలకు పైగా తమతో కలిసి పని చేసిన సహచరుడు ఇకపై రోజువారి విధులలో కనిపించారనే భావన ఉద్యోగులలో ఒక్కింత భావోద్వేగాన్ని నింపింది. పంచాయతీరాజ్ శాఖలో 36 సంవత్సరాల పాటు వివిధ క్యాడర్లలో విధులు నిర్వహించి.. ఏన్కూరు మండల ప్ర జాపరిషత్ కార్యాలయంలో సుమారు సంవత్సరంన్నర పాటు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా సేవ లందించిన మలిశెట్టి సూర్యనారాయణ పదవీ విరమణ పొందారు. మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ ఆధ్వ ర్యంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు.. సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు.

**అంకిత భావంతో సేవలు..సూర్యనారాయణ సార్..మాకు సహోద్యోగి మాత్రమే కాదు..**

**వీడుకోలు కార్యక్రమంలో పలువురు సహచరులు**

సూర్యనారాయణతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు."విధుల్లో ఎంత బాధ్యతగా ఉంటారో..వ్యక్తిగతంగా అం త ఆత్మీయంగా ఉంటారు. సమస్య వచ్చినప్పుడు ముందుండి పరిష్కారం చూపేవారు. మాకు ఆయన ఒక అధికారి కంటే..మార్గదర్శి" అని అన్నారు .సూర్యనారా యణ తన ఉద్యోగ జీవితంలో పంచాయతీరా జ్ శాఖలోని వివిధ క్యా డర్లలో బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు..ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేశారని పలువురు కొనియాడారు. గ్రా మీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి..రహదారులు..భవనాలు తదితర పనుల పర్యవేక్షణలో ఆయన అం దించిన సేవలు ప్రశంసనీయమన్నారు.

**విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు.**

.ఏ బాధ్యత అప్పగించినా నిబద్ధతతో.. సమయ పాలనతో పూర్తి చేయడమే కాకుండా



సహచర ఉద్యోగులతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ అందరి మన్ననలు పొందారని అధికారులు..సిబ్బంది పేర్కొన్నారు. 36 ఏళ్ల సుదీర్ఘ ఉద్యో గ ప్రస్థానంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు.

**ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ అభినందనలు.**

. సూర్యనారాయణ సుదీర్ఘకాలం పంచాయతీరాజ్ శాఖలో అంకిత భావం తో సేవలందించడం అభినందనీయమని ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ అన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత..అనుభవం..సేవా దృక్పథం సహచర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచాయని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్లను అనుభవం తో అధిగమిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించారని ఆమె కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన రోజు నుంచి..పదవి విరమణ చేసే రోజు



వరకు..ఆయన బాధ్యతయుతంగా పనిచేయడం గొప్ప విషయమని ఆమె అన్నా రు. ఆయన సేవలు సహచర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. మండలంలో పంచాయతీరా జ్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఆయనకు కొన్ని రోజుల క్రితం ఉత్తమ ఏఈగా ప్రభుత్వం ఎంపిక చేసి రాష్ట్ర డిప్యూటీ శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా సూర్యనారా యణ అవార్డుతో పాటు..ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని ఆమె తెలిపారు. పదవీ



విరమణ అనంతరం ఆయన కు టుంబ సభ్యులతో సుఖసంతోషాలతో.. ఆయు రారోగ్యాల తో జీవించాలని ఆమె ఆకాంక్షించారు.

**ఉద్యోగ జీవితం ఎంతో నేర్పింది..మలిశెట్టి**

వీడ్కోలు కార్యక్రమంలో సూర్యనారాయణ మాట్లాడుతూ..36 ఏళ్ల ఉద్యోగ జీవితంలో తనకు సహకరించిన ఉన్నతాధికారులు..సహచర ఉద్యోగులు..సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగంలో ఎన్నో ప్రాంతాలలో పని చేశాను.. ఎన్నో అనుభవాలు..ఎన్నో జ్ఞాపకాలు..నా వెంట ఉన్నాయి. విధి నిర్వహణలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరిని ఎప్పటికీ మర్చిపోలేను. ఉద్యోగ విరమణ అనేది..సహజమైన ప్రక్రియ..కానీ సహచరుల ఆత్మీయత..ఈ రోజు మీరు చూపిన అభిమానం ఎప్పటికీ గుర్తుండిపోతుంది అని సూర్యనారాయణ భావోద్వేగంతో పేర్కొన్నారు

**శాలువాలతో సన్మానం..జ్ఞాపిక అందజేత..**

అధికారులు..ఉద్యోగులు..సిబ్బంది..సూర్యనారాయణ..లక్ష్మి దంపతులకు శాలువాలతో ఘనంగా సన్మానించి..జ్ఞా పికను అంద జేశారు. పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సహచరులు ఆయనతో కలిసి పని చేసిన ఆయన అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. 36 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానా నికి ముగింపు పలికినా.. సహచరుల మనసులలో సూర్యనారాయణతో ఉన్న అనుబంధం మాత్రమే కొనసాగుతూ నే ఉంటుందనే భావన ఈ వీడ్కోలు కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు,సిబ్బంది,వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామపంచాయతీ కార్యదర్శు లు..సర్పంచులు, సూర్యనారాయణ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

### రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి మృతి

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (ఆగస్టు 31)**



దుమ్ముగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి గెరటాపు గాంధీ (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు గత కొంతకాలంగా గాంధీ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు ఈ క్రమంలో అతని ఆరోగ్యం విషమించడంతో ఇంటి వద్దనే మృతి చెందాడు గాంధీ 2011 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశాడు గాంధీ మృతి పట్ల పలువురు ఫారెస్ట్ సిబ్బంది స్నేహితులు విచారం వ్యక్తం చేశారు

### అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం



**దమ్మపేట రూరల్ ఆగస్టు 31 ప్రభాతవార్త**

:దమ్మపేట అటవీ శాఖ రేంజ్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో పాకల గూడెం నుండి తిరుమలకుంటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇసుక రవాణా కొరకు అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేంజర్ కె.శ్రీను తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, అటవీ సంపదను అనుమతులు లేకుండా రవాణాకు పాల్పడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ రవాణాకు పాల్పడినట్టు తెలిస్తే ప్రజలు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాలని వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. చట్టాలను అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ హెచ్చరించారు.

### జిల్లా బిజెపి కార్యవర్గంలో ఇద్దరు మహిళలకు చోటు

**తల్లాడ ఆగస్టు 31: ప్రభాతవార్త**





జిల్లా భారతీయ జనతా పార్టీలో తల్లాడ మండలం నుండి ఇద్దరు మహిళలకు చోటు కల్పించారు జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా నన్నపనేని శారద గాదే పద్మావతి లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశించారు తల్లాడ కు చెందిననన్నపనేని శారద మల్లారం కు చెందిన గాదే పద్మావతి లకు కార్యవర్గంలో చోటు లభించింది

### పునెం సరోజకు కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ పదవి

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా పునెం సరోజ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రేణుకా అక్షర మహిళా మండలి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా సమస్యల పరిష్కారానికి, మహిళల అభ్యున్నతికి సరోజ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు, అలాగే సహకరించిన డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌లకు, జిల్లా నాయకులు గురిజాల గోపి లకు మహిళా మండలి ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పునెం సరోజకు శుభాకాంక్షలు తెలిపారు.




## శిరీష మృతికి గురుకులంలో అశ్రునివాళి

**భద్రాచలం, ఆగస్టు 31(ప్రభాతవార్త):**



హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ దుండగుల చేతిలో హత్యకు గురైన ఊకే శిరీష మృతికి భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులు, సిబ్బంది అశ్రునివాళులర్పించారు. సోమవారం కళాశాల ఆవరణలో శిరీష చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుణ్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న శిరీషను దారుణంగా హత్య చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనతో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని తెలిపారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షి స్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**సిపిఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య**




**దుమ్ముగూడెం: ప్రభాత వార్త (ఆగస్టు 31)**

దుమ్ముగూడెం మండలంలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు ప్రాజెక్టు పూర్తయితే మండలంలోని సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్న ప్రభుత్వం దుమ్ముగూడెం రైతుల సాగునీటి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. భద్రాచలం నుండి వెంకటాపురం వరకు శిథిలావస్థకు చేరిన ప్రధాన రహదారికి నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం ఆదివాసీలకు హక్కు పత్రాలు అందించాలని, అటవీ అధికారుల వేధింపులు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారుమండలంలో తాగునీరు సాగునీరు విద్య వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని సమస్యలను పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పుల్లయ్య హెచ్చరించారుకార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య అధ్యక్షత వహించగా జిల్లా కమిటీ సభ్యురాలు కొర్స చిలకమ్మ, సరియం కోటేశ్వరరావు యలమంచి శ్రీను బొల్లి సత్యనారాయణ కొమరం చంటి మహమ్మద్ బేగ్ కాకా కృష్ణ సరియం రాజమ్మ, పెద్ది చిన్నక్క కొమరం శాంత కొర్స లింగరాజు సోడి శ్రీనివాసరావు గోవర్ధన్ కల్లూరి లక్ష్మయ్య పాయం హరిబాబు కల్లూరి శ్రీను సరియం నాగేశ్వరావు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన బిడ్డలకు రక్షణ కల్పించాలి

**శిరీష హత్యాచార నిందితులను**

**కఠినంగా శిక్షించాలి**

**ఎస్ఎఫ్ఐ-టీఏజీఎస్ ఆధ్వర్యంలో నిరసన**

**భద్రాచలం క్రైమ్, ఆగస్టు 31(ప్రభాత వార్త):**

గిరిజన మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచార ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్), ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. భద్రాచలంలో సోమవారం ఎస్ఎఫ్ఐ-టీఏజీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ భద్రాచలం పట్టణ కార్యదర్శి కుంజ శ్రీను, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్




మాట్లాడుతూ.. ఊకె శిరీషపై జరిగిన దారుణ ఘటన తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. శిరీషపై హత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు భద్రత లేకుండా పోతున్న పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గిరిజన బిడ్డలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళలు, బాలికలపై దాడులు పునరావృతం కాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఊకె శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ-టీఏజీఎస్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**మాల మహానాడు మండల అధ్యక్షుడు జినుగు దాసు**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**



రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అమర్ ప్రసాద్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత, దూషణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు బూర్గంపహాడ్ మండల అధ్యక్షుడు జినుగు దాసు అన్నారు. అంబేద్కర్ వంటి మహనీయుడిపై విమర్శలు చేసి వివాదాలను సృష్టించడం ద్వారా ప్రచారం పొందాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే అవకాశం ఉందని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అమర్ ప్రసాద్ వ్యాఖ్యలపై అంబేద్కర్‌వాదులు, దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని జినుగు దాసు తెలిపారు. అంబేద్కర్ గౌరవాన్ని కించపరిచేలా ఎవరూ వ్యాఖ్యలు చేయకూడదని, ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇల్లంగి లాలయ్య, మంద కీర్తికుమార్, చెలికాని శివ, యాస వినోద్‌కుమార్, చెలికాని రాంకి తదితరులు పాల్గొన్నారు.

## ఇరవెండిలో వీఎస్‌బీజీ రామ్ జీ గ్రామసభ

**ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ఏకగ్రీవ తీర్మానం**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఇరవెండి గ్రామపంచాయతీలో వీఎస్‌బీజీ రామ్ జీ పథకం కింద ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గుండి బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధికి అవసరమైన వివిధ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా 125 రోజుల పని హామీ, కనీస వేతనం రూ.300, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామానికి అవసరమైన చెరువుల పూడికతీత, కుంటల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులను గుర్తించి లేబర్ బడ్జెట్‌లో చేర్చేందుకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్పందన, ఏపీఎం, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సారపాక ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

**సారపాక, ప్రభాతవార్త:**




సారపాక ప్రధాన కూడలిలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. రోజురోజుకూ వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ లేకపోవడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగినేని ప్రోలు-సారపాక, ఇరవెండి-సారపాక, భద్రాచలం వైపు వెళ్లే ప్రధాన రహదారులు సారపాక కూడలి వద్ద కలవడంతో ఈ ప్రాంతం కీలకమైన ట్రాఫిక్ జంక్షన్‌గా మారింది. పీక్ అవర్స్‌లో వాహనాల రద్దీ మరింత పెరగడంతో రహదారి దాటే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వాహనాల్లో తరలివస్తుంటారు. పండుగలు, సెలవు రోజుల్లో భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉండటంతో సారపాక ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**రోడ్ల విస్తరణతో పాటు రింగురోడ్డు అవసరం**

సారపాక ప్రధాన కూడలిలో రహదారులను విస్తరించడంతో పాటు ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు రింగురోడ్డు ఏర్పాటు చేసే అంశాన్ని అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన కూడలికి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించే అవకాశం కల్పిస్తే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

**నాలుగు కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి**

ప్రధానంగా నాలుగు దిశల నుంచి వచ్చే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సిగ్నల్స్‌తో పాటు జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారుల కోసం ప్రత్యేక మార్గాలు, రోడ్డు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

**అధికారుల సమన్వయంతో శాశ్వత పరిష్కారం**

రోడ్లు, భవనాల శాఖ, పోలీస్ శాఖ, రవాణా శాఖ, స్థానిక సంస్థల అధికారులు సంయుక్తంగా సారపాక ప్రధాన కూడలిని పరిశీలించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన చోట ట్రాఫిక్ సిబ్బందిని నియమించడంతో పాటు సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు ప్రజల విజ్ఞప్తిపై స్పందించి సారపాక ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు విస్తరణ, అవసరమైన చోట రింగురోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపడితే వాహనదారులు, పాదచారులతో పాటు భద్రాచలం వచ్చే భక్తులకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

# 16 మంది పోలీస్ అధికారులకు ప్రతిభ పురస్కారాలు

## పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం 2026 జూన్ 2 పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. ఉత్తమ సేవ పతకాలు సాధించిన ముగ్గురిలో అడిషనల్ డీసీపీ బి.రామానుజం, హెడ్ కానిస్టేబుళ్లు వి.బిక్షపతి, కె సూర్యప్రకాష్ రెడ్డి వున్నారు. వారితో పాటు సేవ పతకాలు సాధించిన (13) మందికి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక



కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 15 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షి ంచారు.

**ఉత్తమ సేవ పతకం**

అడిషనల్ డీసీపీ బి.రామానుజం, వి.బిక్షపతి ఏఆర్ హెచ్ సీ కె సూర్యప్రకాష్ రెడ్డి హెచ్ సీ

**సేవ పతకం సాధించిన పోలీస్ అధికారులు**

కె.నాగేంద్రరావు ఎస్ఐ ఎండీ హనీఫ్ ఏ ఎస్ఐ ఎన్.రామిరెడ్డి ఏ ఎస్ఐ బి. సుందర్ రావు ఏ ఎస్ఐ ఎండీ .హలీమ్ ఏ ఆర్ ఎస్ ఐ జి.భాస్కర్ రావు ఏఆర్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు హెచ్ సీ టి.హరిచరణ్ సింగ్ హెచ్ సీ ఎస్ కే .మదార్ సాహెబ్ హెచ్ సీ ఐ.ప్రభాకరరావు హెచ్ సీ సీ హెచ్ .రామారావు హెచ్ సీ జె.కృష్ణ పీసీ డి.సుశీల్ కుమార్ పీసీ.




# భావి లోని మృత దేహాన్ని వెలికి తీసిన అన్నం

ఖమ్మం అర్బన్,ఆగస్టు31(ప్రభాత వార్త)



అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావు బావి లోనుండి మృత దేహాన్ని సోమవారం వెలికి తీశారు.ఖమ్మం అర్బన్ పోలీస్ పరిధిలో ఈనెల 29న బాల పేటకు చెందిన పెంటి కృష్ణయ్య 50 సంవత్సరాల వయసు ఇంటి నుండి తప్పిపోయినడని అర్బన్ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చి ఉన్నారు. సదరు పెంటి కృష్ణయ్య బాలపేట దగ్గర వ్యవసాయ బావిలో శవమై కనిపించింది ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు అర్బన్ పోలీసు సమక్షంలో ఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని బావి నుండి బయటకు తీసి మార్చురికి తరలించారు. కాలినడకన పొలాల వెంట వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లి తాళ్ల సహాయంతో బావిలోకి దిగి సాహసోపేతంగా మృతదేహాన్ని బావి నుండి పోలీసులు కుటుంబ సభ్యుల సమక్షంలో బయటికి తీసి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురికి తరలించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

# ముప్పైమూడేళ్ల ఉద్యోగ ప్రస్థానానికి ముగింపు

## ఆర్ టి సి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరిసింహరావుకు ఆత్మీయ వీడ్కోలు

ఖమ్మం వైద్య విభాగం ఆగస్టు 31 (ప్రభాతవార్త)



సుదీర్ఘకాలం ఖమ్మంలో ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ డా.ఎ.వి. గిరిసింహా రావుకి ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు అధికారులు, కుటుంబసభ్యులు, అనుమాయులు హృదయాత్మకంగా ఘనంగా వీడ్కోలు పలికారు. 33 ఏళ్ల ఉద్యోగ విధినిర్వహణలో వైద్యంతో పాటు ఎన్నోసేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, వైద్య అవగాహనా కార్యక్రమాలు, 16 సార్లు మేడారం జాతర ఇంఛార్జ్ మెడికల్ క్యాంప్ ఇంచార్జ్ గా 30 సార్లు భద్రాచలం శ్రీరామనవమికి, 20 సార్లు ముక్కోటికి, రెండు గోదావరి పుష్కణాలకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు, వేములవాడ శివరాత్రి జాతరకు విశేష వైద్య సేవలందించి కార్మికుల హృదయాలలో సుస్థిరస్థానం సంపాదిం చుకున్న వేద్యాధికారికి పలువురు దుశ్శాలువలతో పూలదండలతో, సన్మాన పత్రాలతో గౌరవించారు . డా. గిరిసింహారావు మాట్లాడుతూ. కరీంనగర్ జన్మభూమి అయినా ఖమ్మం కర్మభూమి అని అవకాశమిచ్చిన అధికారులకు ఆదరించిన కార్మికోద్యోగులకు భావోద్వేగ భరితంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మేళతాళాలతో పుష్పాం జలులతో సాగనంపారు. పట్టణ ప్రముఖులు, వైద్యులు, రాజకీయ నాయకులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం

## శ్రీరక్ష ఆసుపత్రి డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు

ఖమ్మం అర్బన్ ఆగస్టు 31 (ప్రభాతవార్త)



ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాముల మవుదామని శ్రీరక్ష ఆసుపత్రి డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అన్నారు.సోమవారం ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, సింగరాయపాలెం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. లక్ష్మీ ్మనారాయణ,శ్రీ జి. ప్రసాద్ ఆధ్వర్యంలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు శ్రీ గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జి.వి.) మెడికల్ సూపరింటెండెంట్ శ్రీ ఏడుకొండలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై మరియు భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి మంచి అలవాట్లను అలవర్చుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ, ఇతరులను కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

# మైనారిటీ అభ్యర్థులు ఉచిత టీజీపీఎస్సీ గ్రూప్స్ ఫౌండేషన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్

ప్రభాత వార్త గాంధీ చౌక్ ఆగస్టు31:

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో టీ జీ పీ ఎస్ సీ గ్రూప్1 ప్రిలిమ్స్, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్ కేంద్రంగా ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణలోని ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ వర్గాలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ఈ ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పని సరిగా డిగ్రీ విద్యార్హత పూర్తి చేసి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 14 లోగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల భవన సముదాయం, ఎం.ఏ.ఎం. క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, గోషామహల్, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9704003002 ఫోన్ నంబర్ లో సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గౌడ సంక్షేమ భవన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

రఘునాథపాలెం ,ప్రభాతవార్త ఆగస్టు 31

రఘునాథపాలెం సబ్ స్టేషన్ ఎదురుగా ఖమ్మం గౌడ సంఘానికి తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 30 గుంటల స్థలంలో 5 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న గౌడ సంక్షేమ భవన్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానిక సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ ్మనారాయణ గౌడ్, హస్తకళలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, వేర్హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, స్థంబాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ వాళ్ళ దుర్గాప్రసాద్ ,జిల్లా గ్రాందాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు గౌడ్, ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, తదితరులు



# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షి ంచారు.

**ఉద్యోగ విరమణ పొందిన వారు..**

వి. సుధాకర్ రెడ్డి(ఎస్ఐ)కె. రాయప్ప( ఎస్ఐ )వి. రామరావు(ఎస్ఐ ) ఎం. శ్రీనివాసరావు (ఏ ఎస్ఐ )ఎండీ . అబ్దుల్ రహెమాన్ (ఏ ఎస్ ఐ )ఎస్ కే . అహ్మద్ (హెచ్ సీ )కె. సత్యం (హెచ్ సీ )బి. సుందర్ రావు(ఏ ఆర్ ఎస్ ఐ )ఆర్ .వెంకటేశ్వర్లు, (హోంగార్డ్ )కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఆర్ ఐ లు కామరాజు, సురేష్, పోలీస్ అసోసి యేషన్ అధ్యక్షులు హేమనాథ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను, జాతీయ ఉపాధ్యక్షులు ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






# ముగ్గురు పోలీసు అధికారుల పదవి విరమణ

## ఘన సన్మానం చేసిన

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, ఆగష్టు 31 ప్రభాతవార్త:**

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 37 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో సేవలందించిన ఏఎస్ఐ పసునూరి నాగరాజు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ అలీ, ఏఎస్ఐ చాచు వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందారు. వీరిని జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు తమ పోలీసు సేవా అనుభవాలను పంచుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన అధికారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఎస్పి ఇన్స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా సాయి కుమార్

**జూలూరుపాడు, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా దిబ్బెందుల సాయికుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ చెంగల గురునాథం మాదిగ అధ్యక్షతన సోమవారం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా గార్లపాటి నవీన్, ప్రధాన కార్యదర్శిగా దొంగల సృజన్, సహాయ కార్యదర్శిగా పోతురాజు అనిల్ కుమార్, అధికార ప్రతినిధి గార్లపాటి నిఖిల్, కోశాధికారిగా ఉబ్బపల్లి నరసింహారావు, కార్యవర్గ సభ్యునిగా జంగం నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన కోసం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు సాగి మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో కాకటి కృష్ణ, గార్లపాటి కృష్ణ, గార్లపాటి శివ కృష్ణ, బద్రి, విసనపల్లి కళ్యాణ్, నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తా:

## రేణుకా చౌదరి

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగష్టు 31 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాజీ కేంద్ర మంత్రివర్యులు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ఆవశ్యకత, జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కలిగే ప్రయోజనాలను వివరించారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, సంబంధిత డాక్యుమెంట్లను రేణుకా చౌదరికి అందజేశారు. దీనిపై స్పందించిన రేణుకా చౌదరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందించాలనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంకల్పానికి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ఒక మంచి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ఫూర్తిని తీసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ పసుపులేటి వీరబాబు తెలిపారు.



# వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా కరపత్రాల ఆవిష్కరణ

**కొత్తగూడెం, ఆగష్టు 31 ప్రభాతవార్త:**

పారంపర్య వైద్య మహా సంఘం (పి.వి.ఎం.ఎస్) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల కరపత్రాలను ఎం.పీ. (రాజ్యసభ) సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. సోమవారం భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని బి.ఆర్.ఎస్ భవన్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారంపర్య వైద్యులందరూ ఒక తాటి మీదికి రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందించారు. కాగా నిర్వాహకులు వద్దిరాజు రవిచంద్ర కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్య. రామంచి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వైద్య. జి. సుగుణారావు, ప్రకృతి ప్రేమికులు మహమ్మద్ ముస్తఫా, దశరథ్ రజువాలు పాల్గొన్నారు.



# గిరిజన యువతి హత్య అత్యంత హేయం

## నిందితులను కఠినంగా శిక్షించాలి

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**కొత్తగూడెం టౌన్, ఆగష్టు 31 ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన యువతి (నర్సు) హైదరాబాద్ శివారు ప్రాంతంలో దారుణ హత్యకు గురికావడం అత్యంత హేయమైన చర్య అని, ఈ అమానుష ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా అన్నారు. ఈ ఈ ఘటనపై సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం వెళ్లి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పరిధిలోని తుక్కుగూడలో నర్సుగా సేవలందిస్తున్న గిరిజన బిడ్డపై దుండగులు పాశవికంగా దాడి చేసి హత్య చేయడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మహిళలపై ఇలాంటి పైశాచిక దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ హత్యోదంతంపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి, బాధ్యులైన నిందితులను గుర్తించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి వద్ద గిరిజన, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలుపుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అన్ని విధాలా న్యాయం చేయాలని ఆయన కోరారు.

# పాడే మోసిన ఎమ్మెల్యే..

## అశ్రునయనాల మధ్య నర్సు శిరీష అంత్యక్రియలు

## చౌటిగూడెంలో ముగిసిన అంతిమ సంస్కారాలు

## బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే జారే ఆదినారాయ

## శిరీష భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

**ములకలపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



హైదరాబాద్‌లోని తుక్కుగూడ ప్రైమ్ కేర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ ఊకే శిరీష ఇటీవల అనూహ్యంగా మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించగా, సోమవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. మృతదేహం చౌటిగూడెం చేరుకున్నప్పటి నుంచి అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ దగ్గరుండి అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించారు. శిరీష భౌతికకాయానికి స్వయంగా పాడే మోసి, అంత్యక్రియలు జరిపించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తానం పద్మ, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరావు, తాటి వెంకటేశ్వర్లు, దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, ములకలపల్లి మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, నాయకులు కారం సుధీర్, జహీర్, తాండ్ర ప్రభాకర్ రావు, మడకం చిరుమప్ప, మడకం శ్రీను, తమ్మిశెట్టి శ్రీను, పామర్తి వెంకటేశ్వర్లు, సోయం వీరభద్రం, కట్రం స్వామి, తెల్ల చెన్నయ్య, జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్, సీతారాంపురం సర్పంచ్ కుంజా రవి, పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి, ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరి కిషోర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలి: మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త :**

బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా సెప్టెంబర్ 2వ, తేదీ నుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలపై సోమవారం కామేపల్లి మండలం కొత్త లింగాల లో మండల పార్టీ శ్రేణులతో కలిసి ఇల్లందు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సన్నాహక సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అంతోటి అచ్చయ్య,సామ మోహన్ రెడ్డి,మల్లెంపాటి శ్రీనివాసరావు,కాట్రాల రాంబాబు,బోడేపూడి బుచ్చిబాబు,శెట్టి శ్రీనివాసరావు, కొనకంచి శంకర్రావు, జల్లి రాములు, గండమాల చందర్ రావు, కన్నమాల రాంబాబు, బత్తుల పుల్లయ్య,పార్టీ సర్పంచ్ లు ,మాజీ సర్పంచ్ లు,మాజీ ఉపసర్పంచ్ లు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా అనారోగ్యానికి గురై న పార్టీ మండల నాయకులు, కొమ్మినేపల్లి మాజీ సర్పంచ్ మూడు కృష్ణ ప్రసాద్ నాయక్ ను మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మండల పార్టీ నాయకుల బృందం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతన కోలుకోవాలని కోరారు.




## నేడు శ్రీనిధి డిగ్రీ కళాశాలలో వాక్ఇన్ ఇంటర్వ్యూలు

### సద్వినియోగం చేసుకోవాలని కోరిన చైర్మన్ అనిల్ కుమార్

**మధిర ఆగస్టు 31 ప్రభాతవా ర్త**

మధిర పట్టణంలోని శ్రీనిధి డిగ్రీ కళాశాలలో మంగళవారం సెప్టెంబర్ 1న దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ వై అనిల్ కుమార్ నెహ్రు తెలిపారు . శ్రీనిధి డిగ్రీ కళాశాలలో నిర్వహించను న్నఈ ఇంటర్వ్యూలో పాల్గొనే అభ్యర్థులు. టెన్త్ ఇంటర్ ఐటిఐ బిఎస్సీ, (కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ), బీఫార్మసీ బీటెక్ ఎంఎస్సీ ఎం ఫార్మసీ తో పాటు బీఎస్సీ బీకాం బిఏ అభ్యర్థులు కూడా అర్హులు అని నిర్వాహకులు తెలిపారు. 21–25 సంవత్స రాల మధ్య వయసు కలిగిన వారై ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉ 9గం.ల నుంచి మధ్యాహ్నం 3 గం.ల వరకు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం తెలిపింది.

## చెరువులో క్రిమిసంహారక మందు పై విచారణ

**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



చెరువుమాధారం చెరువులో క్రిమిసంహారక మందు చల్లిన ఘటన పై అధికార యంత్రాంగం విచారణ చేపట్టింది. చెరువులో క్రిమిసంహారక మందు చల్లిన విషయం పై సోషల్ మీడియాలో, వివిధ పత్రికలలో ప్రచురితమైన విషయం విధితమే. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం సోమవారం విచారణ కు ఆదేశించారు. ఇరిగేషన్ డీఈఈ పొట్టయ్య, మత్స్యశాఖ ఏడీ మల్లేశం, రెవిన్యూ శాఖ నుంచి మండల తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి లు ఆయా శాఖల వారీగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. చెరువులో చల్లిన మందు ఏమిటి, ఎందుకు చల్లారు, ఎవరూ చల్లమన్నారు తదితర విషయాల పై క్షేత్ర స్థాయి లో వివరాలు అడిగి తెలుసున్నారు. మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం పాలకవర్గంను కూడ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ విషయం పై రాజారాంపేట పిఏసిఎస్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఈపూరి శ్రీనివాసరెడ్డి మరో మారు ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయటంతో పాటు, నేలకొండపల్లి యంపీడీఓ యం.యర్రయ్యకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## మల్లారం గ్రామంలో వీజీపీపీ పనుల గుర్తింపునకు గ్రామసభ నిర్వహణ.

**పాల్వంచ,ఆగస్టు 31,ప్రభాత వార్త:**



పాల్వంచ మండలంలోని మల్లారం గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి ప్రణాళిక (వీజీపీపీ) పనుల గుర్తింపు కోసం సోమవారం సర్పంచ్ అధ్యక్షతన తొలి గ్రామసభ నిర్వహించారు.గ్రామసభలో గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అధికారులు ప్రజలకు సమగ్రంగా వివరించారు.గ్రామ ప్రజల అవసరాలు,ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు విస్తృతంగా చర్చించారు.గ్రామస్థుల సూచనలు,అభిప్రాయాలను సేకరించి వాటిని గ్రామాభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్,సహాయ ప్రాజెక్టు డైరెక్టర్,రమణ,జిల్లా శిక్షణ సమన్వయకర్త రాజు,గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి,సాంకేతిక సహాయకుడు, క్షేత్ర సహాయకుడు,ఇంజినీరింగ్ కన్సల్టెంట్తో పాటు సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## గ్రామపంచాయతీ సమస్యల పరిష్కరించండి

**పాల్వంచ,ఆగస్టు 31,ప్రభాత వార్త:**



పాల్వంచ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాండురంగాపురం తండ గ్రామపంచాయతీ ప్రతినిధులు ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.వినతిపత్రంలో గ్రామానికి కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేయాలని,పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులు,అంగన్వాడీ భవన నిర్మాణ బిల్లులను వెంటనే మంజూరు చేసి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాండురంగాపురం తండ సర్పంచ్ ఉప్మా,ఉపసర్పంచ్ మార్గ అంకయ్యతో పాటు గ్రామపంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాల పంపిణీ.

**పాల్వంచ,ఆగస్టు 31,ప్రభాత వార్త:**



మండలంలోని బసవతారక కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, ప్రీప్రైమరీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బసవతారక కాలనీ సర్పంచ్ జరుపుల కాశమ్మ,పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు భానోత్ హర్సింగ్,ఉపాధ్యాయురాలు అలివేలు మంగమ్మ, ప్రీప్రైమరీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి,ఆయాలు పాల్గొని విద్యార్థులకు బ్యాగులు,పుస్తకాలను అందజేశారు.కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది.



## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



మణుగూరు సబ్ డివిజన్ లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ఆయన సోమవారం మణుగూరు పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడారు.మణుగూరు పరిసర ప్రాంతాల్లో ఎవరైనా ఏ పేర్లతోనైనా గ్యాంగ్లను ఏర్పాటు చేసి సెటిల్మెంట్లు చేయడం, అల్లర్లు సృష్టించడం లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిని గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు ఎలాంటి గ్యాంగ్లు లేదా ఆకతాయి మూకల సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని డీఎస్పీ హామీ ఇచ్చారు.అక్రమ గ్యాంగ్లు, సెటిల్మెంట్లపై పోలీసుల నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు.

## మణుగూరులో డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలన



**మణుగూరు, ప్రభాతవార్త, 31:**

మణుగూరు మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వానాకాలం 2026 డిజిటల్ క్రాప్ సర్వేను మణుగూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… రైతులు సాగు చేసిన పంట పొలాలను వాలంటీర్లు సర్వే నంబర్ల వారీగా పరిశీలించి, డిజిటల్ క్రాప్ సర్వే యాప్లో ఫోటోలతో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రైతు సోదరులందరూ బాధ్యతగా వాలంటీర్లకు సహకరించి పంట వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతి పంటను ఈ యాప్లో నమోదు చేసుకుంటేనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు, డిసిఎస్ వాలంటీర్లు కొండ్రు మల్లేష్, కొమరం మధు, కిరణ్, మునిగెల శ్రీనివాసరావు, విశ్వంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మొండికుంట లో పశు వైద్య శిబిరం

**అశ్వాపురం,ప్రభాతవార్త, ఆగస్టు 31;**



అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో పాత గ్రామ పంచాయతీ ఆఫీస్ ఆవరణలో మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో అశ్వాపురం మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ కె ఫర్వీన పాల్గొని పశువులకు శస్త్ర చికిత్సలు చేసి,గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించారు.అదే విధంగా దూడలకు మరియు మేకలకు కోళ్లకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.గేదెలలో సంతానోత్పత్తి గురించి,గేదలు ఎదకు వచ్చినప్పుడు దున్నలను దాటించకుండా తగు సమయంలో ఆర్టిఫిషియల్ ఇన్సిమ్రినేషన్ చేస్తే గేదెలలో గర్భకోశ వ్యాధులు రాకుండా మంచి మేలు జాతి దూడలను పొందవచ్చని రైతులకు సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ గ్రామాలలో ఇలాంటి సదస్సులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహిస్తే రైతులకు కూడా అవగాహన ఉంటుందని ఈ విధంగా చేయడం వల్ల గ్రామాలలో పాల ఉత్పత్తి కూడా మెరుగుపడుతుందని. అలాగే పశు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రైతులకు కూడా పశువుల పట్ల తగు సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పశువులకు సంబంధించిన రైతులు మరియు పశువైద్య సిబ్బంది అరుణ, జగదీష్,రాజబాబు, నాగరాజు,అరవిందు,మాజీ గోపాల్ మిత్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం.

**పినపాక, ప్రభాత వార్త, ఆగష్టు 31**

.మండల పరిధిలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సంకీర్త్, ఎంఈఓ కే నాగయ్య తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక మహిళలు సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రైతులు భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి.

**అశ్వాపురం,ప్రభాతవార్త, ఆగస్టు 31:**

అశ్వాపురం మండలంలోని నెల్లిపాక రెవెన్యూ పరిధిలో నిషేధిత జాబితాలో ఉన్న రైతుల భూములను ఆ జాబితా నుండి తొలగించాలని మొండి కుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మర్రి సంధ్యమల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం అశ్వాపురంలోని రైతువేదిక లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ సర్వే నెంబర్లు190,433, 450,997,ఇతర నెంబర్ల గల భూములను అధికారికంగా,అనధికారికంగా నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితాలో చేర్చారని,నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అట్టి భూములు రైతుల అవసరాల కొరకు అమ్మకాలు,కొనుగోలు జరగకుండా ఉండటమే కాకుండా రైతులందరూ చిన్న సన్నకారు,రైతుల అవడం వలన వారి కుటుంబాల్లో పెళ్లిళ్లు జరిగిన కూడా వారసులకు ఇవ్వడానికి కుదరడం లేదన్నారు.కావున తక్షణమే అట్టి భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఈరోజు ప్రజావాణిలో రైతుల పక్షాన వినతి పత్రాన్ని అందజేశామని అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను తొలగించాలని వారు కోరారు.



## ఘనంగా దివ్యాంగ బాలల ఆటల పోటీలు.



**పినపాక, ప్రభాత వార్త, ఆగష్టు 31**

మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ బాలబాలికల మండల స్థాయి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి నాగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ హాజరయ్యారు.వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ బాలబాలికలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈఓ నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయురాలు దీవెన,సమగ్ర విద్య వనరుల వ్యక్తి అంబిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన యానబోయిన రాజేశ్వరి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుమారుడు సాంబశివరావుకు ఈ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎల్ఓసీ ద్వారా అండగా నిలుస్తోందని, బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి సేవలు అభినందనీయం



**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి ఐసిడిఎస్ సర్కిల్ సూపర్వైజర్ పి.లక్ష్మి అందించిన సేవలు అభినందనీయమని ప్రాజెక్ట్ సిడిపిఓ ఉమ, ఇల్లందు ఏ సి డి పి ఓ నారపరాజు దయామణి, రిటైర్డ్ హెచ్ఎంలు య లమంచిలి నాగేశ్వరరావు, లింగా రుక్మగంధర్ రావు అన్నారు.సూపర్వైజర్ లక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా పండితాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన సన్మాన మహోత్సవంలో వారు లక్ష్మి కి శాలువా కప్పి ఘనంగా సన్మానించి ఆమె ఐసిడిఎస్ లో 40 ఏళ్లుగా అందించిన సేవలను ప్రశంసించారు. కామేపల్లి సర్కిల్ లో రెండేళ్లు పాటు బాధ్యతా యుతంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి వృత్తికే వన్నె తెచ్చి ఆదర్శంగా నిలిచారని అన్నారు.లక్ష్మీ ని స్ఫూర్తిదాయకంగా తీసుకొని ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎ ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు , హెల్పర్లు, బంధు మిత్రులు, లక్ష్మీ భర్త లింగా రమేష్, కుమారుడు గౌతమ్, కుమార్తె మోనిక పాల్గొని సూపర్వైజర్ లక్ష్మీ సేవలను ప్రశంసించి ఘనంగా సన్మానించారు

## పదవీ విరమణ సన్మానం

**వైరా టౌన్ ఆగస్టు 31 (ప్రభాతవార్త)**



1989 డీఎస్సీ ద్వారా డైరెక్ట్ ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన దొంతెబోయిన సత్యనారాయణ (డి ఎస్ ఎన్) 37 ఏళ్ల పాటు విద్యారంగంలో విశేష సేవలందించారు. అశ్వారావుపేట, తల్లాడ, కొణిజర్ల, వైరా మండలాల్లో ఉపాధ్యాయుడిగా, వివిధ హోదాల్లో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఎం ఆర్ పి, డి ఆర్ పి, ఎస్ ఆర్ జి, మాడ్యూల్ రైటర్గా మండల, జిల్లా రాష్ట్ర స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాల్లో సేవలందించారు. వైరా నియోజకవర్గంలో గ్రామపంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు రిసోర్స్ పర్సన్గా విధులు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. డైట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసి పలువురు ఛాత్రోపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహించారు. 2024 డీఎస్సీలో ఆయన శిష్యులు పలువురు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం విశేషం. సన్మానించిన గరికపాడు గ్రామ సర్పంచ్ శ్రీమతి లక్కిరెడ్డి నాగలక్ష్మి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మరియు పాలకవర్గ సభ్యులు పంచాయతీ సెక్రెటరీ మరియు పంచాయతీ సిబ్బంది ఉపాధ్యాయుడు సత్యనారాయణ ను ఘనంగా సన్మానించారు.

## దేవాలయ ఈవో రామారావు పదవి విరమణ

**ఏన్కూరు,ఆగస్టు 31, ప్రభాతవార్త**



నాచారం స్వయంగా వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి..శ్రీ పద్మావతి అమ్మవార్ల దేవాలయా ల ఈవోగా పనిచేస్తున్న ఉడతనేని రామారావు పదవీ విరమణ పొందారు. ఆయనస్థానంలో దేవాలయ మేనేజర్ ఎస్.వి.డి. ప్రసాద్కు ఈవో బాధ్యత లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ వి డి ప్రసాద్ కు వేద పండితులు శాలువాతో సన్మానించారు. పదవి విరమణ పొందిన ఉడతనేని రామారావుకు స్వా మివారి దేవాలయంలో స్వామివారికి వేద పండితులు పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేసి..సత్కారం చేశా రు.ఈ కార్యక్రమంలో ఆలయాల వేద పండితులు శ్రీనివాస ఆచార్యులు,సత్యనారాయణ ఆచార్యులు,సిబ్బంది పా ల్గొన్నారు.

## సదరం క్యాంపులకు అర్హులైన దివ్యాంగులను గుర్తించాలి.

**పినపాక, ప్రభాత వార్త, ఆగష్టు 31.**

మండల పరిధిలోని గ్రామ సర్పంచ్లు సెప్టెంబర్ నెల సదరం క్యాంపు లకు అర్హులైన దివ్యాంగులను వెంటనే గుర్తించి,నమోదు చేయించాలని ఎంపిడివో సంకీర్త్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ సర్పంచులు బాధ్యతగా గ్రామాల్లో డప్పు,మైక్ ప్రకటనలు, వాట్సాప్ గ్రూపుల సహకారంతో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు అవసరమైన పత్రాలతో హాజరయ్యేలా చూడాలని,ఆశా, అంగన్వాడీ, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.నమోదు వివరాలను వెంటనే మండల కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు.

## నిరు పేదల సొంతింటి కలే ప్రభుత్వ లక్ష్యం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



నిరు పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన సోమవారం మణుగూరు మండలంలోని విఠల్ రావు నగర్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రావుల పరిమిళ, కోటేశ్వరి, గంగిశెట్టి ఎల్లమ్మ కుటుంబ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే పాయం అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి దివ్యాంగుల సంఘం చేయూత



**ఇల్లందు, ఆగస్టు 31, (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదంలో తీవ్ర విషాదాన్ని ఎదుర్కొన్న బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొల్లాపురం గ్రామానికి చెందిన పాయం సురేష్ కుటుంబానికి జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ-ఇండియా) ఇల్లందు యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పాయం సురేష్ భార్య, కూతురు మృతి చెందగా, సురేష్ ఒక కాలును, కుమారుడు రెండు కాళ్లను కోల్పోయి దివ్యాంగులుగా మారారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వారిని కోల్పోవడంతో పాటు జీవనోపాధి కూడా దెబ్బతినడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక సభ్యులు దివ్యాంగ మిత్రుల నుంచి సేకరించిన రూ.4,000లను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి త్వరలోనే మంచి రోజులు రావాలని, ఈ కష్టాలాన్ని ఎదుర్కొనే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని సంఘం సభ్యులు ఆకాంక్షించారు.ఏ సమస్య వచ్చినా తమ సంఘం అండగా ఉంటుందని, కుటుంబానికి ఉపాధి కల్పించే విధంగా వృత్తిపరమైన అవకాశాలు అందించేందుకు కృషి చేస్తామని సంఘం ప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఈ సహాయ కార్యక్రమానికి సహకరించిన ప్రతి దివ్యాంగ మిత్రుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ (ఇండియా) ఇల్లందు యూనియన్ అధ్యక్షుడు తేళ్ల ప్రవీణ్ కుమార్, కార్యదర్శి చెలిమల్ల రాజేందర్, ఉపాధ్యక్షుడు రామోజు ఈశ్వర్, యాక్టివ్ ఆర్గనైజర్లు లోద్ రాజ్ కుమార్, వలీ ఖాన్ పాల్గొన్నారు.

## నేటి ఇఫ్టు జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

**కొత్తగూడెంలో భారీ ప్రదర్శన..**

**కార్మికుల సమస్యలపై గళమెత్తనున్న ఇఫ్టు**





**ఇల్లందు అర్బన్, ఆగస్టు 31, (ప్రభాతవార్త):** సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో నిర్వహించనున్న ఇఫ్టు జిల్లా సదస్సు, ప్రదర్శనను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఇఫ్టు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లందు జేకే సివిల్ కాంట్రాక్టు కార్మికుల వద్ద ప్రచారం నిర్వహించిన అనంతరం ఇఫ్టు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 2013 నుంచి హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. హమాలీ, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, అన్ని రంగాల్లో పనిచేస్తున్న ఇల్లు లేని కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆదాయం కోల్పోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, కేజీబీవీ, హెల్త్ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పోస్టు, ప్రీ మెట్రిక్ హాస్టల్ వర్కర్లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను అర్హులైన కార్మికులకు సకాలంలో అందించాలని, లేబర్ కార్డులను రెన్యువల్ చేయాలని కోరారు. బీపీఎల్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కేటీపీఎస్‌లో ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ, సినిమా థియేటర్లు, పెట్రోల్ బంకులు, హోటళ్లు తదితర సంస్థల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లందు మనుగడను రక్షించాలి సింగరేణి పుట్టినిల్లైన ఇల్లందు ప్రాంతం మనుగడను కాపాడాలని, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల్లో కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని సీతారామయ్య డిమాండ్ చేశారు. కోయగూడెం, సత్తుపల్లి, మణుగూరు గనుల వేలాన్ని నిలిపివేయాలని, అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలపై నిర్వహిస్తున్న జిల్లా సదస్సుకు ఇఫ్టు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షులు కన్నెగంటి రవి హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇఫ్టు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం.డి. రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్, ఏరియా కమిటీ అధ్యక్షులు రావూరి ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో విఫలం..ఆర్‌జేసీ కృష్ణ



**వైరా టౌన్ ఆగస్టు 31 (ప్రభాతవార్త)** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని. కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని సర్ వైర నియోజవర్గం ఇంచార్జ్ ఆర్ జె సి కృష్ణ అన్నారు. సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక మిట్టపల్లి గార్డెన్స్ లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 420 హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిందని ప్రభుత్వాన్ని విమర్శించారు రేవంత్ ప్రభుత్వంలో దోపిడీ తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ చేసిన ఒక అభివృద్ధి చూపించాలని సవాల్ విసిరారు. వైరా నియోజకవర్గ వ్యాప్తంగా సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు జరిగే వెయ్యి రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు. 2 తారీకున వైరా నియోజకవర్గ కేంద్రంలో ధర్నా బాకీ కార్డులు పంచటం 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ఐదో తారీఖున ఫీజు రియంబర్స్మెంట్ జాబ్ క్యాలెండర్ యూత్ డిక్లరేషన్ కొరకు విద్యార్థుల యువతతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. మూడో తారీఖున కొనిజర్ల మండల కేంద్రంలో వ్యవసాయ నీటిపారుదల రంగం యూరియా రైతు బీమా కొరకు రైతు సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగో తేదీన మహిళలకు 2500 కెసిఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, విద్యార్థులకు స్కూటీ ఇవ్వని ప్రభుత్వానికి నిరసనగా కారేపల్లి మండల కేంద్రంలో వంటావార్పు నిర్వహిస్తామని తెలిపారు, ఆరో తారీఖున ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏడో తారీఖున ప్రజావాణిలో అన్ని మండల కేంద్రాల్లో 420 హామీలపై వినతి పత్రాలు సమర్పించాలని. ఎనిమిదో తేదీన అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రవతి, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావ్, బాణాల వెంకటేశ్వరరావు, వనమా విశ్వేశ్వరరావు, లకవత్ గిరిబాబు, భానోత్ మనీషా లక్ష్మి, ముత్యాల సత్యనారాయణ, పొట్ల శ్రీనివాసరావు, ముత్యాల వెంకట అప్పారావు, మద్దెల రవి, అప్పం సురేష్, లాల్ అహ్మద్, ఏదునూరి శ్రీను, మరికంటి శివ, చిలక తిరుపతి, శ్రీను, భాను, సక్కుబాయి, వదినెపల్లి చక్రవర్తి, మెట్టపల్లి సత్యబాబు, వాసిరెడ్డి శంకర్రావు, దామా లిఖిత్ చౌదరి, మాటేటి కిరణ్, చల్లా మోహన్ రావు, ఆధురి ప్రేమ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అంచనాల కమిటీ పగ్గాలు చేపట్టిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు, ఆగస్టు 31, (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర శాసనసభ కార్యాలయంలో ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, ప్రభుత్వ వ్యయాలపై సమగ్ర పర్యవేక్షణ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వహించే అంచనాల కమిటీకి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం ఇల్లందు నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ హాజరై సమావేశాన్ని పర్యవేక్షించారు. సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, బడ్జెట్ అంచనాలు, ప్రభుత్వ వ్యయాల సమర్థ వినియోగంపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు చేరేలా తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ, ప్రజా అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ నిధుల సద్వినియోగమే అంచనాల కమిటీ ప్రధాన లక్ష్యం. ప్రజా ధనాన్ని పారదర్శకంగా వినియోగించేలా కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుంది అని తెలిపారు. ఈ సమావేశంలో అంచనాల కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, సుదీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, శాసనసభ, శాసన మండలి ప్రధాన అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలతోనే కాంగ్రెస్‌కు కొత్త ఊపు



**ఇల్లందు, ఆగస్టు 31 ,(ప్రభాతవార్త):** గ్రామ స్థాయి నుంచే కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము పిలుపునిచ్చారు.సోమవారం పోచారం తండా, బోయి తండా, మాణిక్యారం, ముత్తారపుకట్ట, రొంపేడు, మామిడిగుండాల, సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీల్లో విస్తృతంగా పర్యటించి నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీలను ఎన్నుకున్నారు. రాము మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని పేర్కొంటూ, వారి కష్టాన్ని గౌరవిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు ఇస్లావత్ సతీష్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కాకటి భార్గవ్ , నాయకులు మూతి కృష్ణ, పూనెం సురేందర్, వాంకుడోత్ భారతి శ్రీను, చెన్నూరి శ్రీను, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, పడిగ సంపత్, ధారావత్ తులిస్యా, పాయం కృష్ణప్రసాద్, మోకాళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పదవీ విరమణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

విద్యారంగంలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న అంకంపాలెం గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు కత్తుల ఆల!!య్య కుక్కల పులమ్మల పదవీ విరమణ మహోత్సవం లో సోమవారం అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈక్రమంలో పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు తరగతి



గదిలో అందించే విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తారని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు విద్యార్థులకు విద్యాబోధన చేసి, వారి ఉన్నతికి కృషి చేసిన కత్తుల ఆలయ్య, కుక్కల పులమ్మ సేవలు అభినందనీయ మన్నారు. ఉపాధ్యాయుల పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి మాత్రమేనని, విద్యార్థుల హృదయాల్లో వారు నాటిన జ్ఞానం, విలువలు, స్ఫూర్తికి మాత్రం ఎప్పటికీ పదవీ విరమణ ఉండదని అన్నారు. అంకంపాలెం సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూములు వెలికితీసి పేదలకు పంచాలి

**దమ్మపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త:**




దమ్మపేటలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెంటనే వెలికి తీసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏ ఐ యు కె ఎస్ మండల కమిటీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి తహసిల్దార్ కు డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా అనంతరం పండూరి వీరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం, డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, అఖిలభారత ఐక్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇళ్ల స్థలాలు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అనేక హామీలు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. అనేకమంది ఇండ్లు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని, వారిని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవటంలేదన్నారు. దమ్మపేట మండలంలోని 31 పంచాయతీలలో ఇల్లు లేని అనేకమంది నిరుపేదలు ఉన్నారని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, దమ్మపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ ఆ భూములన్ని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల కనుసన్నలలోనే ఉన్నాయని ఆ భూములను వెంటనే వెలికి తీసి నిరుపేదలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంగాధర నాగమణి, సత్య, సత్యవతి, ఎం అరుణ, షేక్ మున్ని, సిద్ధిని నాగమణి,తాటి శ్రావణి, షేక్ హుస్సేన్, రమణ, హీరోజ్ పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

**ప్రజావాణిలో గ్రామస్తుల ఫిర్యాదు**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**




బూర్గంపహాడ్ మండల కేంద్రంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను తక్షణమే అరికట్టి, జనావాసాల మధ్య రాత్రివేళల్లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ పరిసర ప్రాంతాల నుంచి కిన్నెరసాని ఉపనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. సుమారు 30 వరకు ట్రాక్టర్లు రాత్రివేళల్లో జనావాసాల మధ్యగా వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. కొంతమంది ట్రాక్టర్లకు లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేసి పెద్ద శబ్దాలతో ప్రయాణించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రి వేళల్లో ట్రాక్టర్ల రాకపోకలతో ఏర్పడుతున్న శబ్ద కాలుష్యం కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు నిద్రకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ట్రాక్టర్లు అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాల భయం నెలకొందని తెలిపారు. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారన్న ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నిస్తే కొందరు ట్రాక్టర్ యజమానులు, సంబంధిత వ్యక్తులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తమపై వ్యక్తిగత దాడులకు దిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తమకు భద్రత కల్పించడంతో పాటు అక్రమ ఇసుక రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని అధికారులను కోరారు.ఇసుక తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారిలో కే.వి. రమణ, ఇసంపల్లి పుల్లయ్య, తోకల శ్రీనివాసరావు, రాయల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

**అశ్వారావుపేట అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వాల్మీకి కిశోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ రైతులకు హామీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని




వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, అర్హులైన ప్రతి కుటుంబంలోని మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలం లేని పేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుడితి చిరంజీవి, సోడెం ప్రసాద్, తగరం నిర్మల, మడకం గోవిందు, వెంకటేశ్వరరావు, దుర్గా రావు తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ మోసాలను ప్రజా గొంతుకై ప్రశ్నించాలి

**జూపల్లి రమణారావు**

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీల అమలు పై ప్రజలను మోసం చేయడం మొదలు పెట్టి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా గొంతుకై ప్రశ్నించడానికి సిద్ధం కావాలని బిఆర్ఎస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ జూపల్లి రమణారావు పిలుపునిచ్చారు. సోమవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2 వ తారీకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తి చేసుకుంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద రోజులలో నెరవేరుస్తామన్న హామీలను 1000 రోజులు ఐన హామీలను నెరవేర్చడంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్, కేటీఆర్, నియోజక వర్గ ఇంచార్జీ మెచ్చ నాగేశ్వరరావుల ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ తరపున 7 రోజులు నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ 7 రోజుల నిరసన కార్యక్రమలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ హామీల అమలే ప్రధాన ఎజెండాగా పారిశుధ్యం, విద్యా, వైద్యం సమస్యలపై వాస్తవాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ సమర శంఖం పూరించిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా రోజుకో విధంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు.

## ఏజెన్సీలో భూ అక్రమ దందాలు, అక్రమ వ్యాపారాలపై

**ప్రజావాణిలో ఏజెన్సీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతి**

**దమ్మపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

తెలంగాణ ఆదివాసి ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దమ్మపేట ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈక్రమంలో ఏజెన్సీ ప్రాంత షెడ్యూల్ ఏరియాలో జరుగుతున్న గిరిజనేతర భూ అక్రమ దందాలు, మందలపల్లి షెడ్యూల్డ్ ఏరియా ప్రకాష్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న బహుళ అంతస్తులు, అక్రమ వ్యాపారాల పై షెడ్యూల్ ఏరియా రూల్స్ రెగ్యులేషన్ 1/70 చట్టాలకు 1996 పంచాయతీ రాజ్ పిసా చట్టం యొక్క గ్రామ సభ తీర్మానాలు ఏజెంట్ గవర్నమెంట్ వారి పర్మిషన్లు ఏమీ లేకుండా ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగం కల్పించి ఇచ్చిన హక్కులు చట్టాలు సైతం ప్రభుత్వ అధికారులు గిరిజనేతరులు రాజకీయ నాయకులు దుర్వినియోగం చేస్తూ రాజకీయాలను అడ్డుపెట్టుకొని భూ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. అక్రమాలు చేస్తున్నటువంటి గిరిజన నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ ఆదివాసి జేఏసీ సంఘాలు ఆరోపిస్తూ అలాగే మా ఆదివాసి బిడ్డ ఊకే శిరీష కు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సంఘాలు నాయకులు బండారు సూర్యనారాయణ, వాసం వెంకటేశ్వరరావు, సోయం ఉమామహేశ్వరరావు, పూణెం రమేష్, సోయం ముత్యాలరావు, కారం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



# వైరా ప్రజల ఆరోగ్యానికి వాకింగ్ ట్రాక్, రిక్రియేషనల్ స్థలం ఏర్పాటు చేయాలి

**వైరా టౌన్ ఆగస్టు 31 (ప్రభాతవార్త)**

వైరా పట్టణ ప్రజల ఆరోగ్యం, శారీరక దారుఢ్యం మరియు మానసిక ఉల్లాసాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ మరియు రిక్రియేషనల్ స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ డా. కాపా చంద్రకళ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఎంపీడీవో కి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం వైరా పట్టణంలో సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత మరియు ఇతర ప్రజలు ఉదయం, సాయంత్రం సురక్షితంగా నడక సాగించేందుకు, వ్యాయామం చేసేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు తగిన ప్రత్యేక స్థలం అవసరం ఉందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. వాకింగ్ అనేది ఆరోగ్యకరమైన జీవనశైలిలో అత్యంత సులభమైన మరియు అందరికీ అందుబాటులో ఉండే వ్యాయామం



అని, అందువల్ల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఒక సమగ్ర వాకింగ్ మరియు రిక్రియేషనల్ ప్రదేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ స్థలంలో దశలవారీగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, సీనియర్ సిటిజన్ల కోసం విశ్రాంతి బెంచీలు, మహిళలు మరియు యువత కోసం వ్యాయామ సౌకర్యాలు, పిల్లల కోసం వినోదాత్మక సదుపాయాలు మరియు పచ్చదనం ఏర్పాటు చేసే విధంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. గౌరవ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవవైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్ నాయక్ కూడా ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని డా. కాపా చంద్రకళ తెలిపారు. వైరా ప్రజలకు వాకింగ్ ట్రాక్ మరియు రిక్రియేషనల్ స్థలం అవసరమనే విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించి, ఎం.ఆర్.ఓ తో కూడా ఈ అంశంపై మాట్లాడి, అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అందుబాటులోకి తీసుకురావడానికి చొరవ చూపుతున్నారని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో పాటు రెవెన్యూ, మున్సిపల్ మరియు సంబంధిత శాఖల సమన్వయంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యామ్ బాబు, తోటకూర శ్రీకాంత్, బిక్యా తదితరులు పాల్గొన్నారు.




## ఫామ్ పాండ్ పనులు ప్రారంభం



**కారేపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త**

రైతులకు ప్రయోజనం చేకూర్చే క్రమంలో సాగు పంటలకు నిరందించే విధంగా నీటి సంరక్షణ లో భాగంగానే నీటి నిల్వకుంటలకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని రేకులగూడెం గ్రామ సర్పంచ్ మోతి వీరస్వామి అన్నారు. సింగరేణి మండల పరిధిలోని రేగుల గూడెం గ్రామపంచాయతీలో ఎల్లబోయిన నాగేశ్వరరావుకు మంజూరైన ఫారం పాండ్ పనులకు సోమవారం సర్పంచ్ మోతి వీరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పంట కుంటలను ఐదు ఎకరాల లోపు ఉన్న రైతు కి జాబ్ కార్డు ఉన్నవారికి ఇవ్వడం జరుగుతుందని అన్నారు ఈ నీటి సంరక్షణలో భాగంగా పంట కుంటల వలన నీటిని నిలువ చేసుకొని పంటలు పండించుకోవడానికి చేపల పెంపకానికి భూగర్భ జలాలను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు అర్హులైనటువంటి రైతులు ఉంటే గ్రామపంచాయతీ ఆఫీసులో వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ పంట కుంటల కి ప్రభుత్వమే ఉచితంగా 96 వేల రూపాయలను మంజూరు చేస్తుంది అన్నారు కాబట్టి గ్రామపంచాయతీలో రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపసర్పంచ్ ఆవుల సత్యనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్ ఈసంభద్రం గ్రామ పెద్దలు పిట్టల వెంకటేశ్వర్లు చిన్న వెంకన్న అడప వెంకటేశ్వర్లు పిట్టల మధు పోలె బోయిన శ్రీను గ్రామ ప్రజలు ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# నాగేశ్వరరావుకు ఘన సన్మానం.

**.ఏన్కూరు,ఆగస్టు 31, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన ఏన్కూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చింతల నాగేశ్వరరావు పదవీ విరమణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ వీడుకోలు..సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు.కోదండరాంపురం తండా గ్రామపంచాయ తీ కార్యదర్శి గా చింతల నాగేశ్వరరావు విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ మా ట్లాడుతూ..కోదండరాంపురం తండాలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన నా గేశ్వరరావు సేవలను ఆమె కొనియాడారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వ ర్తించారని ఆమె పేర్కొన్నారు.తన విధులను అంకిత భావంతో..బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆమె కొనియా డారు.ప్రభుత్వ సేవలో ఆయన అందించిన సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.పదవీ విరమణ అనంత రం ఆయన కుటుంబంతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు.అదే విధంగా..తోటి గ్రామపంచా యతీ సెక్రటరీలు మాట్లాడుతూ..త మకు ఉన్న బంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను కొనేయాడుతూ శుభాకాంక్షలు



తెలిపారు.అనంతరం అధికారులు,ఉద్యోగులు.. సిబ్బంది..నాగేశ్వరరావు..రాజేశ్వరి దంపతులకు శా లువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అంద జేశారు. నాగేశ్వరరావును అధికారులు.. సిబ్బంది..పంచా యతీ కార్యదర్శులు,వివిధ పార్టీల నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి సిబ్బంది,గ్రామ పంచా యతీ కార్య దర్శులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్ ఫార్మర్ ను సర్పంచ్ అజ్మీర ద్వాలి చిన్న నాయక్, ఉప సర్పంచ్ అజ్మీ ర బన్సీలాల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సూదనపు కోటయ్య, వార్డు సభ్యులు భాగం రంగారావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.గ్రామంలో నెలకొన్న లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు, రైతులు ట్రాన్స్ కో అధికారులకు విన్నవించడంతో కొత్త లింగాల ఏఈ ఎన్.శ్రీనివాసులు, కామేపల్లి లైన్ ఇన్స్పెక్టర్ సుధా శ్రీనివాసరావు, లైన్మెన్ ముడిక శ్రీనివాస్, అసిస్టెంట్ లైన్మెన్ బి.నాగేశ్వరరావు, జూనియర్ లైన్మెన్ నాగరాజు, సిబ్బంది స్పందించి అదనపు ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయటంతో వారు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ ద్వాలి మాట్లాడుతూ గ్రామస్తులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలను అందించడం జరుగుతుందన్నారు.లో వోల్టేజ్ సమస్య ను నివారించడం జరిగిందన్నారు.విద్యుత్ వెలుగుల్లో రామకృష్ణాపురం గ్రామాన్ని నిలపడం



జరిగింది అన్నారు.లో వోల్టేజ్ సమస్య పరిష్కా రానికి తమ కృషికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలూరి రామచంద్రయ్య, కొమ్మినేని సత్యనారాయణ, వల్లభనేని శేషయ్య, తాటిపల్లి నరసింహారావు, వరకాల సర్వయ్య, మేకల రామారావు,పేరసాని శ్రీను, వేగినాటి సురేష్, సందీప్, జుజ్జురి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శేషు ప్రసాద్‌కు ఘనంగా సన్మానం

**కారేపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ ఏరి ఎన్ గా పని చేస్తున్న కొండపల్లి శేషు ప్రసాద్ సోమవారం పదవి విరమణ పొందిన సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం జూనియర్ లెక్చరర్ సంఘం మాజీ అధ్యక్షుడు కేఎస్ రామారావు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి పర్యవేక్షణలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కె.ఎస్ రామారావు మాట్లాడుతూ విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంతోపాటు పలువురి మన్ననలను పొందిన వ్యక్తి శేషు ప్రసాద్ అని కొనియాడారు. పనిచేస్తున్న కళాశాలలో అభివృద్ధి పనులకు సహకారం అందిస్తూ అధ్యాపకులకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే సమయస్ఫూర్తిగా పరిష్కరించిన వ్యక్తి అని అన్నారు. పాఠశాల అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సహకరించి పదవి విరమణ పొందుతున్న శేషు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత శేషు ప్రసాద్ మాట్లాడుతూ నా విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా వైరా రిజర్వాయర్..

### అలుగులపై నుంచి జాలువారుతున్న గోదావరి జలాలు

**వైరా టౌన్ ఆగస్టు 31 (ప్రభాతవార్త)**

గోదావరి జలాల రాకతో వైరా రిజర్వాయర్ నిండుకుండలా మారింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, ప్రస్తుతం 18.5 అడుగులకు చేరడంతో రెండు అలుగులపై నుంచి నీరు జాలువారుతోంది. దీంతో వైరా ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, సీతారామ ప్రాజెక్టు-రాజీవ్ లింక్ కెనాల్ అనుసంధానం, గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరడం వల్ల ఈ ఏడాది రిజర్వా యర్ పూర్తిస్థాయిలో చేరుకుంది. వైరా రిజర్వా యర్‌ను గోదావరి జలాలతో అనుసంధానం చేసి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలనే దూరదృష్టితో సుమారు రూ.100 కోట్ల నిధులతో రాజీవ్ లింక్ కెనాల్‌ను అనుసంధానం చేయడం లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముందు చూపు, కృషి కీలకంగా నిలిచింది. రిజర్వాయర్ నిండడంతో వైరా పరిధిలోని రైతులకు సాగునీటి భరోసా ఏర్పడటమే కాకుండా, అలుగుల ద్వారా అదనపు నీరు దిగువ ప్రాంతాలకు చేరితే మధిర నియోజకవర్గ పరిధి లోని వేలాది ఎకరాల పంటలకు కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఒకప్పుడు నీటి కోసం ఎదురుచూసిన వైరా నేడు గోదావరి జలాలతో కళకళలాడుతోంది. . ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, కిసాన్ కాంగ్రెస్



ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మాజీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దొడ్డ పుల్లయ్య, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, మచ్చా వెంకటేశ్వరరావు (బుజ్జి), జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం, దునూరి సీతారాములు, పొట్లపల్లి శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, పల్లపు కొండలు రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ మిట్టపల్లి సతీష్, గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు, షేక్ సైదా, చప్పిడి వెంకటేశ్వర్లు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, బుడిగి వెంకన్న, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లను తొలగించడానికే సర్ నోటీసుల ప్రక్రియ

పెనుబల్లి, ఆగష్టు 31, ప్రభాతవార్త

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎలక్షన్ కమిషన్ ప్రజలతో ఆటలాడుకుంటోందని సీపీఎం జిల్లా నాయకులు చలమాల విఠల్ రావు, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కాటినేని శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు పంతంగి వెంకటేశ్వరావు ఆరోపించారు. 2002 ఓటర్ల జాబితాలోని పేర్లలోని అక్షరాలకు ప్రస్తుత ఓటర్ల జాబితాలోని అక్షరాల్లో ఉండే చిన్న చిన్న తేడాలకు నోటీసులు ఇచ్చి జనాలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. తగిన సిబ్బందిని నియమించకుండానే నోటీసులిచ్చి హాజరు కావాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన నోటీసులకు తగిన పత్రాలు సమర్పించడానికి ప్రజలు ఒకటి రెండు రోజులు సమయం కేటాయించాల్సి వస్తుందన్నారు. ఉదయం వచ్చిన వాళ్ళ సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తుందని, అప్పటికి సమయం సరిపోకపోతే మరుసటి రోజు రమ్మని బీ ఎల్ ఓ లు పేర్కొనడం వింతగా ఉందన్నారు. అక్షరాల కుండే దీర్ఘాలు,



కొమ్ములు,ఒత్తులు తేడాలున్నాయంటూ బీ ఎల్ ఓ లు పేర్కొంటుంటే ప్రజలు అవాక్కు చెందుతున్నారని విమర్శించారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపేటప్పుడే ఈ దోషాలను సవరణ చేయాల్సి న అధికారులు తిరిగి ఇప్పుడు ప్రజలకు నోటీసులు ఇచ్చి కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. అక్షరాల్లో ఉండే చిన్న చిన్న తేడాలకు మీ పేరు, మీ తండ్రి పేరులో తేడాలు, వ్యత్యాసాలు, పొరపాట్లు ఉన్నాయంటూ నోటీసులు ఇవ్వడంతో ప్రజలు గందరగోళ పడుతున్నారు. ఇచ్చిన నోటీసులకు తగిన ధృవీకరణ పత్రాలతో పంచాయతీ కార్యాలయాలకు హాజరుకావాలని ఒకటి రెండు రోజుల వ్యవధితో నోటీసులు ఇస్తున్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపి అందజేయడానికి ప్రజలు ఆనాడు ఎంతో సమయం కేటాయించారని, తిరిగి ఇప్పుడు నోటీసులకు జవాబిస్తూ హాజరు కావాలనడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని నాయకులు ఆరోపించారు. ఇంత చేసినవతుది జాబితాలో పేర్లు ఉంటాయో లేవో బీ ఎల్ వో లు చెప్పలేకపోతున్నారు. సమర్పించిన ధృవీకరణ పత్రాల ప్రామాణికతను నిర్ధారించడానికి వెరిఫికేషన్ కు పంపబడతాయని నోటీసుల్లో పేర్కొనడం కూడా మరింత గందర గందరగోళానికి దారి తీస్తుందన్నారు. ఇదంతా చూస్తుంటే ప్రజల ఓట్లు ఉద్దేశపూర్వకంగా తొలగించడానికే కేంద్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ ను పావుగా వాడుకుంటుందని ఆరోపించారు. ఇది ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకొని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

కల్లూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త

కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఒక వేదికగా ఉపయోగపడుతోంది. ప్రజలు సమర్పించిన వినతులను సబ్‌కలెక్టర్ పరిశీలించి, సంబంధిత సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అప్పగించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకొని ప్రజల




సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలకు పారదర్శకంగా, జవాబుదారీ తనంతో స్పందిస్తూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం మరియు ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడం ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రభుత్వ యంత్రాంగం అందిస్తున్న ఈ సదుపా యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై**

**బీఆర్ఎస్ పోరుబాట**

**మాజీ ఎమ్మెల్యే సండ్ర**

**వెంకట వీరయ్య**

పెనుబల్లి, ఆగష్టు 31, ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ, నియోజకవర్గంలోని సుమారు 60 వేల



కుటుంబాలకు బీఆర్ఎస్ బాకీ కార్డులను అందించాలని సూచించారు. 100 రోజుల్లో 13 డిక్లరేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సండ్ర విమర్శించారు. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బోనస్, యూరియా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500, వృద్దులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్, విద్యా భరోసా, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల వంటి హామీల పరిస్థితి ఏమైందని ఆయన ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సి న పరిస్థితి ఏర్పడిందని, వివిధ యాప్‌లు, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సండ్ర మండి పడ్డారు. ధరణి స్థానంలో భూ భారతి తీసుకొస్తామని చెప్పి రైతుల భూ సమస్యలను మరింత సంక్లిష్టం చేశారని ఆయన ఘాటుగా విమర్శించారు. భూ సమస్యల పరిష్కారం పేరుతో రైతులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని, అర్హత ఉన్న ప్రతి లబ్దిదారుడినే ప్రాతిపదికగా తీసుకుని పథకాలు అందించామని సండ్ర అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లబ్దిదారుల రాజకీయ నేపథ్యాన్ని చూసి సంక్షేమ పథకాలు అందించే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. 1000 రోజుల సమయం ఇచ్చాం.. ఇక ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి కుటుంబానికి వివరించాలి అన్నారు. బీఆర్ఎస్ బాకీ కార్డులను ప్రజలకు అందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని సండ్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని ఆయన సూచించారు. ఈ సమావేశం లో బి ఆర్ యస్ పార్టీ మండల అధ్యక్షులు కనగాల వెంకటరావు, మాజీ ఎంపీపీ లక్కినేని అలేఖ్య, మాజీ జడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు, ఏ యం సి మాజీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.




## ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ మట్టా

సత్తుపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త



సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ గారు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలునిర్వహించారు.అనంతరం అదే గ్రామానికి చెందిన సాలి బాబురావు నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, రేజర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సత్తుపల్లి పోస్టల్ లో ఆధార్ సేవలు ప్రారంభం

**పోస్టల్ ఇన్స్పెక్టర్ రాజేష్**

సత్తుపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త

సత్తుపల్లి పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సేవ లు అందుబాటులోకి వచ్చినట్లు సత్తుపల్లి పోస్టల్ ఇన్స్పెక్టర్ రాజేష్ సోమవారం పత్రికలకు తెలిపారు. సత్తుపల్లి పట్టణ, మండలం తోపాటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ ఈ ఆధార్ సేవలను సద్వినియోగంచేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆధార్ లో అవసరమైన వివరాల సవరణ లు, ఆ స్టేషన్కు సంబంధించిన సేవలు, ప్రభుత్వం నిర్దేశించిన రుసుములతో ఆధార్ సేవలను చేయనున్నట్లు ఐపిఓరాజేష్ తెలిపారు . ఈ సేవలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల వరకు ఆధార్ సేవలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సత్తుపల్లి పోస్ట్ ఆఫీస్ పరిధిలో, మండలా, నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐపిఓ రాజేష్ కోరుతున్నారు.

## పాము కాటుకు గురై మహిళ మృతి

పెనుబల్లి, ఆగష్టు 31, ప్రభాతవార్త



పెనుబల్లి మండల కేంద్రానికి చెందిన కట్టమూడి భారతమ్మ (60) అనే మహిళ సోమవారం మధ్యాహ్నం పాముకాటుకు గురైంది. అనారోగ్యంగా ఉన్న భారతమ్మ నల్లత్రాచు కరవడంతో వెంటనే అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబ సభ్యులు పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. భారతమ్మను కరిచిన పామును స్థానికులు ఇంట్లో వెతికి పట్టుకొని చంపివేశారు.

## డాక్టర్ నవ్యకాంత్ కు మదర్ తెరిసా చిత్రపటం అందజేత

కల్లూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త



హరితహారం ప్రోగ్రాం సందర్భంగా మిషన్ భగీరథ కార్మికులు కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్ ఎస్ పి పల్లెదావకాన హాస్పటల్ నందు మానవతా మూర్తులు మాధవసేవే మానవసేవ ఒక గొప్ప కార్యచరణ పనులు చేసిన తల్లి మదర్ తెరిసా లామినేషన్ చిత్రపటాన్ని డాక్టర్ నవ్యకాంత్‌కు అందజేశారు. ఇంతటి మంచి కార్యక్రమంలో మదర్ తెరిసా చిత్రపటాన్ని అందించినందుకు వారు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# సిబ్బంది లేక దరఖాస్తుదారుల ఇబ్బంది..!!

**అభాసుపాలవుతున్న ప్రజావాణి..**
**సకాలంలో హాజరుకాని అధికారులు**
**హాజరైనవారిలో సగం సెల్ ఫోన్ కే అంకితం**
**ప్రభుత్వ లక్ష్యం నీరుగారుస్తున్న పలుశాఖల సిబ్బంది**
**వినతులు స్వీకరించే నాథుడే లేక ఇక్కట్లు.**
**. ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం**
**కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో నామమాత్రంగా ప్రజావాణి**

**కూసుమంచి, ఆగస్టు 31 (ప్రభాతవార్త)**

: కూసుమంచి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణి అధికారుల తీరుతో అభాసుపాలవుతోందనడానికి సోమవారం జరిగిన సంఘటనే సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. మండలంలోని సుదూరప్రాంతాలనుంచి ఫిర్యాదుదారులు తమ వినతులు సమర్పించడానికి కార్యాలయానికి రాగా కనీసం ఫిర్యాదు స్వీకరించే





నాథుడే లేక ఇబ్బంది పడ్డారు. ఎంపీడీవో సెలవులో ఉన్న కారణంగా సంబంధిత కార్యాలయం సిబ్బందిని నోడల్ ఆఫీసర్ గా కేటాయించినా...ఎవరూ ఆ బాధ్యత నిర్వర్తించకపోవడంతో ప్రజలు నానా ఇబ్బంది పడ్డారు. తమ గోడు విన్నవించుకునే అవకాశం లేక కంప్యూటర్ ఆపరేటర్ కు తమ వినతులు అందించి, ఆన్ లైన్ చేసుకనే పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఎవరూ లేకపోవడంతో ఇక తమ దరఖాస్తు పరిష్కారం అయినట్లే అని పెదవి విరుస్తూ సంబంధిత ఫిర్యాదుదారులు వెనుదిరిగారు. అధికారులు లేక ఖాళీ కుర్చీలకు వినతి..!!కూసుమంచి మండలకేంద్రంలో సూర్యాపేట ప్రధానరహదారిపై అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని బీజేపీ, ఎంఎల్ పార్టీ నాయకులు ఆర్ అండ్ బీ అధికారులకు వినతి పత్రం సమర్పించేందుకు రావడంతో వినతిపత్రం తీసుకునేందుకు ఏ అధికారి అందుబాటులో లేకపోవడంతో వారు ఖాళీ కుర్చీలకు వినతిపత్రం అందించి వెనుదిరిగారు. ఈ సందర్భంగా కూసుమంచి 8వవార్డు మెంబర్ గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి నిర్వహించి, ప్రజల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని చెప్పే మాటలు అన్నీ డొల్ల అని విమర్శించారు. అధికారులు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాలుగు నెలలైనా పరిష్కారం ఏది..? ఓ రైతు ఆవేదన..తాను కూసుమంచి మండలానికి చెందిన రైతునని, తాను పండించిన పంటను కోనుగోలు కేంద్రంనుంచి ఏప్రిల్ నెలలో ప్రభుత్వానికి 61బస్తాలు అమ్మినట్లు తెలిపాడు. అయితే తన పంటకు సంబంధించిన నగదు వేరే రైతు ఖాతాలో జమ అయిందని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో కూడా మొరపెట్టుకున్నానని, అక్కడనుంచి కూసుమంచి తహసీల్దార్ కు రిఫర్ చేశారని, అప్పటినుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కనీసం పరిష్కారం కాలేదని, తాను మరలా మండలపరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వస్తే కనీసం ఇక్కడ ఫిర్యాదు స్వీకరించే అధికారులే లేరని వాపోయాడు.

# దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

**కూసుమంచి, ఆగష్టు 31 (ప్రభాతవార్త ) :**

దివ్యాంగులను సమాజంలోని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎం ఈఓ రాయల వీరస్వామి అన్నారు. వారిలో అపారమైన ప్రతిభ, సామర్థం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని కూసుమంచి ఎంఈవో రాయల వీరస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు.



దివ్యాంగులలో అపారమైన ప్రతిభ, సామర్థం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. ఆటలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగులు కూడా తమ ప్రతిభను నిరూపించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పి కళ్యాణి, ఫిజియోథెరపిస్ట్ నాగలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేటర్స్ రాజ్యలక్ష్మి, అనిత, కేర్ గివర్ పుష్పలత, సీఆర్పీలు, ఎమ్మార్పీ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్ హియరింగ్ కు పోటెత్తిన ఓటర్లు

**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సర్ కింద నోటీసులు అందుకున్న వారంతా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలకు వరస కడుతున్నారు. తొలుత మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులను తీసుకురమ్మని సూచించటంతో ఆధారాలతో హియరింగ్ కు హాజరవుతున్నారు. సోమవారం ఆచార్లగూడెం, కట్టుకాచారం, మంగాపురంతండా, శంకరగిరితండా గ్రామాలలో హియరింగ్ కార్యక్రమమును నిర్వహించారు. మంగాపురంతండా లో 86 మందికి నోటీసులు ఇవ్వటంతో అంతా హజరయ్యారు. వీరి కోసం కుటుంబ సభ్యులు కూడ రావటంతో జనసందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మంగాపురంతండా గ్రామ సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు హాజరూయ్యారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక కౌంటర్ల ను ఏర్పాటు చేశారు. నోటీసులకు అవసరమైన ఆధార పత్రాలను బీఎల్వే లు, సహాయ ఎన్నికల అధికారుల సమక్షంలో ఓటర్ల ఫోటోలను వారిచ్చిన పత్రాలను మొబైల్ లోని ప్రత్యేక యాప్ లో పొందుపరుస్తున్నారు. నాలుగు రకాల ఆధారాలు తీసుకురావాలని చెప్పటంతో వాటిలో ఆయా కేంద్రాలకు ఓటర్ల తమ కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల వద్ద సందడిగా మారింది. శంకరగిరితండాలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, మంగాపురంతండా లో డిప్యూటీ తహాశీల్దార్ కనకం నరసింహారావు, ఆచార్లగూడెం లో యంపీవో శ్రీనివాసరావు, కట్టుకాచారం లో స్థానిక యంఈవో బి.చలపతిరావు లు హియరింగ్ కు హజరై పత్రాలను స్వీకరించారు.

# దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపాలి

**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

దివ్యాంగులలో ఆత్మస్థైర్యం ను నింపాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు వెల్లడించారు. మండల స్థాయి దివ్యాంగుల పోటీలను సోమవారం రాజేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. దివ్యాంగ బాల, బాలికలు వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచారు. రన్నింగ్, మ్యూజికల్ చైర్, త్రోలింగ్ బాల్స్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడలను నిర్వహించారు. మండలం లోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 35 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ



బి.చలపతిరావు మాట్లాడుతూ ఈ పోటీలు దివ్యాంగులలో ఆత్మ విశ్వాసం కలుగుతుందన్నారు. వారి మధ్య మరింత స్నేహ భావం కలిగి ఉండాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# క్రమశిక్షణ, అంకిత భావం కల్గిన ఆచార్యుడు వెంకటేశ్వర్ రెడ్డి



**నేలకొండపల్లి ఆగస్టు 31 ప్రభాతవార్త:**

క్రమశిక్షణ, అంకిత భావం కల్గిన ఆచార్యుడు వెంకటేశ్వర్ రెడ్డి అందరికీ ఆదర్శమని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడించారు. సోమవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు రాజనీతి శాస్త్ర విభాగ ఆచార్యులు వెంకటేశ్వర రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వర రెడ్డికి పలువురు ప్రముఖులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య వెంకటేశ్వర రెడ్డి గత 38 ఏళ్లుగా విద్యారంగానికి అందించిన విశేష సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేశారని ఆమె చెప్పారు. ఈ సభలో ఎస్సార్ అండ్ బిజీఎన్నార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జాకీరుల్లా, నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్య ప్రసాద్, ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బానోతు రెడ్డి, జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రేషన్ దుకాణంను వెంటనే ఏర్పాటు చేయాలి




**నేలకొండపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

మంగాపురం తండా గ్రామ పంచాయతీ పరిధి లోని చిన్నతండా గ్రామంలో ప్రభుత్వ చౌక దుకాణంను వెంటనే ఏర్పాటు చేయాలని మంగాపురం తండా గ్రామ పంచాయతీ పరిధి లోని చిన్నతండాకు చెందిన ధీరావత్ కోటేశ్వరరావు,పుష్పావతి దంపతులు సోమవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రంను అందజేశారు. చిన్నతండా లో ప్రభుత్వ చౌక దుకాణం లేకపోవడం వలన అక్కడి గిరిజనులు పడుతున్న ఇబ్బందుల గురించి అధికారులకు వారు వివరించారు. మంగాపురంతండా లో ఉన్న చౌకదుకాణం వద్ద కు వెళ్లి బియ్యం తీసుకోవటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాదావు కిలో మీటరు కు పైగా నడిచి వెళ్లి ప్రభుత్వ రేషన్ ను తీసుకోవాల్సి వస్తుందని దీని వలన ప్రజలకు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఈ విషయం పై గతంలో జిల్లా సివిల్ సప్లై అధికారులకు, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని వారు అగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే చిన్నతండా లో ప్రభుత్వ రేషన్ దుకాణం ను వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరారు. చెరువుమాధారం చెరువులో విషపూరిత మందు కలిపిన వారి పై చర్యలు తీసుకోవాలని సొసైటీ మాజీ ఛైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండలం లోని వివిధ సమస్యల పై ప్రజావాణి లో బాధితులు ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య. ఎస్సై శ్రీనివాసరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా**

**స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త**



సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖలు మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయి లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రజలందరూ అంగీకరిస్తే 100 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రూ. 250 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు తావులేకుండా శాంతిభద్రతలను



కాపాడాలన్నారు. తప్పు చేసిన వారికి కఠిన శిక్ష పడాలని, అయితే ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని, వాటిని సక్రమంగా నిర్వహించి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఖమ్మం ప్రజలపైనే ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి



**ప్రజలకు చేరువగా ప్రజావాణి..**

**అన్ని మండలాల్లోనూ నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం, ఆగష్టు 31 ప్రభాతవార్త:**

ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీ.ఆర్.వో పద్మావతి, హౌసింగ్ పీడీ సవయ్ రామ్ తో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్య లను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రతీ మండల ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు, వినతులను మండల ఎంపీడీఓ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలందరు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దమ్మపేట పేట మండలం పట్వారి గూడెం గ్రామానికి చెందిన నడ్డి రాములు, అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన భూక్య నీలావతి, పాల్వంచ మండలం పాలకోయ తండా, మంచి కంటి నగర్ చెందిన గ్రామస్తులు, జూలూరుపాడు మండలం కరివారి గూడెం గ్రామానికి చెందిన బోడ అనిల్, పినపాక మండలం జగ్గారం గ్రామానికి చెందిన పండ సురేష్ బాబు లు తమ దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనారిటీ అభ్యర్థులు ఉచిత టీజీపీఎస్సీ గ్రూప్స్ ఫౌండేషన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్**

**ప్రభాతవార్త గాంధీ చౌక్, ఆగస్టు 31**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో టీ జీ పీ ఎస్ సీ గ్రూప్1 ప్రిలిమ్స్, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్ కేంద్రంగా ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ వర్గాలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పని సరిగా డిగ్రీ విద్యార్హత పూర్తి చేసి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 14 లోగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల భవన సముదాయం, ఎం.ఏ.ఎం. క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, గోషామహల్, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9704003002 ఫోన్ నంబర్ లో సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు**

**ఖమ్మం అర్బన్, ఆగస్టు 31(ప్రభాతవార్త)**



ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జిల్లాలో ఉన్న విద్య, వైద్య, ఇతర అంశాలను సూచిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, జిల్లా పరిధిలో సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీకి చెందిన సంతోష్ లకావత్ గ్రామంలో ప్రత్యేక అధికారి పాలన కాలంలో సుమారు 9 లక్షల రూపాయల వరకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిప్యూటీ సీఈఓ ఖమ్మంకు రాస్తూ సెప్టెంబర్ 9 నాటికి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాల్సిందిగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామానికి చెందిన పాశం నాగేశ్వరరావు తన కుమార్తె పాశం ప్రియమణిని లంకపల్లి బిసి గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులం పాఠశాలకు మార్చాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బిసి సంక్షేమ అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరు మీద ఉన్న ఆరు ఎకరాల 30 గుంటల భూమి తన కుమారుడు, కోడలు వారి పేరు మీద పాస్ పుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు కూడా ఎటువంటి సహాయం చేయడం లేదని తన పోషణ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు మండల స్థాయి లో ఆటల పోటీలు

**విజేతలకు బహుమతులు ప్రధానం**

**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం మండల స్థాయి ఆటల పోటీలను కొత్త లింగాల భవితకేంద్రం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలలో మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలను మండల విద్యాశాఖ అధికారి జి. వెంకట్, కాంప్లెక్స్ హెచ్ఎం బి.నాగేశ్వరరావు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. పోటీల



నిర్వహణ గోవింద్రాల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యులు షేక్ ముజాహిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం, ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇట్టా శ్రీనివాసరావు, ఐ ఈ ఆర్ పి లు ఎం.అనిత కుమారి, టి.శైలజ, స్పెషల్ ఎడ్యుకేటర్ జి.శివ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు డి.మాలిక, ఫిజియోథెరపిస్ట్ జి. రూతమ్మ, కేర్ టేకర్ జి. లలిత, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్న మోడీ సర్కార్.

**అంతర్గాం, ప్రభాత వార్త :**

సామ్రాజ్య వాద దేశమైన అమెరికా లాంటి అగ్ర రాజ్యం తో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్న కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్నదని సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ అనుబంధ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు మేరుగు చంద్రయ్య అన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో సెప్టెంబర్ 8,9 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రం లో నిర్వహించ తలపెట్టిన రైతు కూలీ సంఘం రాష్ట్ర మహా సభల పోస్టర్ ను ఆవిష్కరించి చంద్రయ్య ఈ మేరకు మాట్లాడారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా విత్తనాలు,



ఎరువుల ధరలు పెంచుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించి పరిపాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. సరియైన పంట దిగుబడులు రాక ఒకవైపు, గిట్టుబాటు ధరలు లేక మరో వైపు రైతాంగం తీవ్రంగా నష్టాల పాలు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్న మంచిర్యాల లో తలపెట్టిన రైతు కూలీ సంఘం మహా సభలకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో న్యూ డెమోక్రసీ, రైతు కూలీ సంఘం నాయకులు తూళ్ళ గట్టయ్య, ఉప్పులేటి లింగయ్య, బండి శ్రావణ్, పొనగంటి క్రాంతి కుమార్, నల్లతీగల రమేష్, పరకాల శ్రీశైలం, మంథని శ్రీనివాస్, బొడ్డుపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అభివృద్ధిలో మీ కృషి చిరస్మరణీయం

**గోదావరిఖని, ప్రభాత వార్త:**

సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు రామగుండం ఏరియా1 యాజమాన్యం ఘనంగా వీడ్కోలు పలికింది. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం (సివిల్ క్వాలిటీ) నాగేశ్వరరావు, ఏజీఎం (ఈఅండ్ఎం) రాజాజీ, ఎస్టేట్ విభాగం ఆఫీస్ అటెండర్ బరుపతి పార్వతిని సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా1 జీఎం డి. లలిత్‌కుమార్ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత కీలకమన్నారు. ఎన్నో ఏళ్లపాటు విధులు



నిర్వర్తిస్తూ ఎదురైన సవాళ్లను సమర్థంగా అధిగమించి సంస్థకు సేవలందించిన వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు కాదని.. జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని జీఎం అన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి విముక్తి పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. సింగరేణితో వారికి ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, సంస్థకు వారు అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను సహచరులతో పంచుకున్నారు. సింగరేణిలో పనిచేసే అవకాశం కల్పించిన యాజమాన్యానికి, విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఉద్యోగ జీవితంలో సహచరులతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో జీఎం క్వాలిటీ జే. వెంకటరమణ, ఎస్‌వోటు జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీఎంఓఏఐ ప్రతినిధి సీహెచ్ రాజన్న, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం జీఎం కార్యాలయ ప్రతినిధి బి. పద్మ, ఏజెంట్11 గ్రూప్ చిలుక శ్రీనివాస్‌తో పాటు అధికారులు, పర్సనల్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు.

## కామపిశాచిపై పీడీ యాక్ట్ పెట్టాలి

**గోదావరిఖని, ప్రభాతవార్త: ....**

....... గోదావరిఖని ప్రాంతంలో ఒంటరి మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని లైంగిక దాడులకు పాల్పడుతున్న నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు డిమాండ్ చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం హర్షణీయమేనని, అయితే అరెస్టుతోనే వ్యవహారాన్ని ముగించకుండా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు. వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం.. శివాజీ నగర్‌కు చెందిన నిందితుడు సాయం చేస్తానంటూ మహిళలతో మాట కలిపి నమ్మించి, ద్విచక్ర వాహనంపై నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం అత్యంత దారుణమన్నారు. సీతానగర్ కూరగాయల మార్కెట్, బార్ పరిసరాలను అడ్డాగా చేసుకుని మద్యం, గంజాయి మత్తులో మహిళలను బెదిరించినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తనకు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తెలుసంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిందితుడి వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ పోలీసులుదర్యాప్తు చేయాలని కోరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో నిందితు డిపై ఇప్పటికే నాలుగైదు కేసులు ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. భయంతో మరికొందరు బాధితులు ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్నారన్నారు.

# రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కు రైతులంతా హాజరుకండి

**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల పరిధిలోని కామేపల్లి, పాత లింగాల తదితర రైతు వేదికలలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల 20 నిమి షాల వరకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.తారా దేవి సోమవారం తెలిపారు. పంటల నిర్వాహణ, ప్రత్యామ్నాయ పంటలు, ఎల్ నినో ప్రభావం, వాతావరణం, వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల స్థాయి పై రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి, రైతుల అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. కావున రైతులందరూ కాన్ఫరెన్స్ కు హాజరుకావాలని, ఈ సదవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ మేరకు మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వ ర్యంలో ప్రచారం కూడా నిర్వహించినట్లు తెలిపారు.

## బర్లగూడెం లో దోమల నివారణకు ఫాగింగ్

**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో సర్పంచ్ మాలోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దోమల నివారణకు ము మ్మరంగా ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య సంరక్షణకు మూలాధారమన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మూడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గోవింద్రాల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడ పోటీలు

**కామేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం గోవింద్రాల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుం డి రెండు రోజులు పాటు మండల స్థాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ సోమవారం తెలిపారు. తెలంగాణ పాఠశాల వి ద్యాశాఖ సూచనలు, మార్గదర్శకాలను అనుస రించి స్కూల్ గేమ్ ఫెడరేషన్ లో భాగంగా మండ ల స్థాయి క్రీడా పోటీలు మంగళ, బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలం లోని అన్ని యాజమాన్య పాఠశాలలు విద్యార్థిని విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు అండర్ 17 క్యాటగిరి, అండర్ 14 క్యాటగిరి బాల బాలికలకు నిర్వహించడం జరుగుతుందని తెలి పారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, 100 మీటర్స్ రన్నింగ్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. తొలి రోజు బాలికలకు, రెండవ రోజు బాలురకు క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడలకు కన్వీనర్ గా గోవింద్రాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నాగేశ్వరావు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా షేక్ ముజాహిద్ వ్యవహరించనున్నారని తెలిపారు. అండర్ 14 క్యాటగిరి వాళ్ళ 01.01.2013 తరువాత జ న్మించిన వారు అండర్ 17 క్యాటగిరి వాళ్ళ 01.01.2010 తర్వాత జన్మించిన వాళ్ళై ఉండా లని ఎంఈఓ వెంకట్ తెలిపారు.

## రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

**పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:**

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన, బ్లాక్ మార్కెట్‌కు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ మధుకర్ హెచ్చరించారు. కూర్మపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ ఐ మధుకర్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న ఆటో ట్రాలీని ఆపి తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యాన్ని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్ కు తరలించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు.

## కరాటేలో రామగుండం విద్యార్థుల ప్రతిభ

**ఎన్టీపీసీ, ప్రభాతవార్త:**

హుజూరాబాద్‌లో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026లో రామగుండం జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో కటాస్, కుమితె విభాగాల్లో రామగుండం విద్యార్థులు పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ కటాస్‌లో కీర్తి మహాజీ బంగారు పతకం, బ్లాక్ బెల్ట్ కుమితెలో ఎం.కార్తికేయన్ బంగారు, కీర్తి మహాజీ వెండి పతకం సాధించారు. కలర్ బెల్ట్ కటాస్‌లో శివన్య, పి.వీర వెండి, నిహాల్ నందన్ కాంస్య పతకాలు, కుమితెలో శివన్య బంగారు, పి.వీర వెండి, నిహాల్ నందన్ కాంస్య పతకాలు సాధించారు. విజేతలను స్కూల్ అధ్యక్షుడు ఎం.రమేష్, కోచ్ శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# మల్లారం గ్రామంలో వీజీపీపీ పనుల గుర్తింపునకు గ్రామసభ నిర్వహణ

**పాల్వంచ, ఆగస్టు 31, ప్రభాత వార్త:**



పాల్వంచ మండలంలోని మల్లారం గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి ప్రణాళిక (వీజీపీపీ) పనుల గుర్తింపు కోసం సోమవారం సర్పంచ్ అధ్యక్షతన తొలి గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అధికారులు ప్రజలకు సమగ్రంగా వివరించారు. గ్రామ ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు విస్తృతంగా చర్చించారు. గ్రామస్థుల సూచనలు, అభిప్రాయాలను సేకరించి వాటిని గ్రామాభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్, రమణ, జిల్లా శిక్షణ సమన్వయకర్త రాజు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సాంకేతిక సహాయకుడు, క్షేత్ర సహాయకుడు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో ముగ్గురు ఉద్యోగులకు ఘన సన్మానం

**ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ అభినందనలు**

**రుద్రంపూర్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న ఏజీఎం (సివిల్) రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కోదుమూరి శ్రీనివాస్, జనరల్ అసిస్టెంట్ శ్రీమతి శారదలను ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయం, సివిల్ డిపార్ట్మెంట్ పిట్ కార్యదర్శులు సీహెచ్ సాగర్, మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వోటు జీఎం గోవిందరావు, కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏజీఎం రామకృష్ణ తన ఉద్యోగ ప్రస్థానాన్ని 1989లో ఏఈగా ప్రారంభించి సింగరేణిలోని పలు ఏరియాల్లో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఏజీఎం స్థాయికి చేరుకున్నారని తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో ఏజీఎంగా సేవలందించి పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. అలాగే కోదుమూరి శ్రీనివాస్ క్లర్క్గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తన సేవా కాలంలో వివిధ పదోన్నతులు పొందుతూ అకౌంట్స్ ఆఫీసర్గా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో జనరల్



అసిస్టెంట్గా విధులు నిర్వహించిన శారద కూడా తన సేవలతో మంచి ఉద్యోగినిగా గుర్తింపు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం రామకృష్ణ, శ్రీనివాస్, శారదలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని, వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులు, సివిల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదివాసీ నర్సు శిరీష మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలి

**సానద్ ఉల్లా ఖాన్పై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్**

**ఆధార్ సొసైటీ జాతీయ అధ్యక్షులు గొంది వెంకటరమణ**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



జిల్లాలోని ములకలపల్లి మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకే శిరీష మృతి అత్యంత విషాదకరమని ఆధార్ సొసైటీ జాతీయ అధ్యక్షులు గొంది వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఆధార్ సొసైటీతో పాటు ఏఈడబ్ల్యూసిప, ఏఎంసిఎస్, ఏఎస్ఎఫ్, ఆదివాసీ మహిళా సంఘాలు, ఆదివాసీ విద్యార్థి సంఘాల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అడవి ప్రాంతం నుంచి హైదరాబాద్కు ఉద్యోగం కోసం వెళ్లిన ఆదివాసీ ఆడబిడ్డ శిరీష, ఇతరుల ప్రాణాలను కాపాడే నర్సు వృత్తిలో సేవలందిస్తూ ప్రాణాలు కోల్పోవడం సమాజాన్ని కలచివేసిందన్నారు. ఉద్యోగ నిమిత్తం నగరానికి వచ్చిన ఆదివాసీ యువతికి తగిన రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. శిరీష మృతికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న సానద్ ఉల్లా ఖాన్పై ఎలాంటి పక్షపాతం లేకుండా పోలీసులు సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సేకరించి వాస్తవాలను వెలికితీయాలని, విచారణలో నేరం రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్ష విధించాలని కోరారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వెంకటరమణ కోరారు. ముఖ్యంగా నర్సులు, రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మహిళా ఉద్యోగులకు పటిష్టమైన భద్రత కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు, పూనెం. శ్రీనివాస్, లక్ష్మీ దేవిపల్లి, సర్పంచ్, తాటి. అనిత, తిరులేష్, ఏఈడబ్ల్యూసిప, జిల్లా అధ్యక్షులు, పోలేబోయిన. వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్స. లక్ష్మ న్, మలకం, స్వామి, తోలెం. వెంకటేశ్వర్లు, పెండెకట్ల, రామనాథం, పూనెం. సమ్మయ్య, గోగ్గేలా. నాగేశ్వరావు, కొమరం. పాపారావు, చీమల. అచ్చయ్య .తాటి. సూరయ్య. కుంజా. లక్ష్మీ నారాయణ. ఏటీఎఫ్, అధ్యక్షులు పాయం. ఆనందరావు, అట అధ్యక్షులు. బిజ్జ. శ్రీను, తుడుందెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, తెల్లం. నర్సింహా రావు, పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై నమోదైన కేసులు ఎత్తివేయాలి

**కొత్తగూడెంలో కాంగ్రెస్ భారీ ఆందోళన..**

**పోలీసులతో తోపులాట**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్లను వెంటనే ఎత్తివేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కులం పేరుతో అవమానించారని ఆరోపిస్తూ, ఇందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరిన నేపథ్యంలో ఆయనపై అక్రమంగా కేసులు నమోదు చేశారని తోట దేవి ప్రసన్న ఆరోపించారు. రాహుల్ గాంధీపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఖర్గేను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్రంలోని మోదీ, బీజేపీ ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ప్రజా ఆగ్రహం వ్యక్తమవుతుందని హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పీఠం సెంటర్కు చేరుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా, త్రీ టౌన్ సీఐ ఆధ్వర్యంలోని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు త్రీ టౌన్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, పీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి కోడుమూరు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు, జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పైడా రాజేంద్రప్రసాద్, అబ్బులు, మండల అధ్యక్షులు నర్రా అజయ్ కుమార్, దేవరగట్ల ప్రసాద్, భువన సుందర్ రెడ్డి, పూనెం శ్రీనివాస్, పాల సత్యనారాయణ రెడ్డి, చిమట నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు తెలియదనడం విడ్డూరం

**వీరు నాయక్**

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

ఉద్యోగాలు, బదిలీలు, ఇసుక ర్యాంపుల పేరుతో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న వసూళ్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పీఏ కొర్ల కళ్యాణ్కుమార్ వ్యవహారంలో ఎమ్మెల్యేకు ఏమీ తెలియదనడం నమ్మశక్యంగా లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే, పీఏతో పాటు సంబంధిత వ్యక్తుల బ్యాంకు లావాదేవీలపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.



# ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

**-బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఆర్.వి**

**బయ్యారం, ప్రభాతవార్త, ఆగస్టు 31:**



తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ రేపాకుల వెంకన్న (ఆర్ వీ)ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని, ఉద్యోగాలు లేక ప్రభుత్వం ఇస్తామన్నా నిరుద్యోగ భృతి రాక నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆర్ వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేత్రదానం చేయండి - మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపండి

**ఐడీఓసీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు**

ఖమ్మం వైద్య విభాగం,ఆగస్టు 31(ప్రభాత వార్త )

నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు డాక్టర్ పి. శ్రీజతో పాటు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేత్రదాన ప్రాధాన్యత, అర్హతలు, నేత్రదానం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఖమ్మం నేత్రనిధి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ.... 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేత్రదాన అవగాహన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం చేయండి – మరోకరి జీవితంలో వెలుగులు నింపండిఅనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నేత్రదానం ఎవరైనా చేయవచ్చని తెలిపారు. కళ్లద్దాలు వాడేవారు, మధుమేహం, బీపీ, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడేవారు, కంటిశుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని పేర్కొన్నారు. కామెర్లు, ఎయిడ్స్,



బ్లడ్ క్యాన్సర్ కారణంగా మరణించిన వారు నేత్రదానానికి అనర్హులని, ఇతర కారణాలతో మరణించిన వారు ఏ వయస్సులోనైనా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేత్రదానం వల్ల మృతదేహం ముఖాకృతిలో ఎలాంటి మార్పు ఉండదని, కంటి పై పొర అయిన కార్నియాను మాత్రమే సేకరిస్తారని చెప్పారు. నేత్రదానం చేసిన వ్యక్తి మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, నేత్రదానం ఒక మహత్తర సేవగా గుర్తించాలని కోరారు. మరణించిన వ్యక్తి నుంచి 6 నుంచి 8 గంటల్లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. మరణించిన వెంటనే కళ్లను మూసి వాటిపై తడి గుడ్డ లేదా ఐస్ ముక్క ఉంచాలని, తల క్రింద రెండు దిండ్లు ఎత్తుగా ఉంచాలని, ఫ్యాన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. మరణం సంభవించిన వెంటనే ఖమ్మం నేత్రనిధికి సమాచారం అందించడం ద్వారా సకాలంలో నేత్రదానం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తమ చుట్టుపక్కల ఎవరైనా మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులను నేత్రదానానికి ప్రోత్సహించి ఖమ్మం నేత్రనిధికి సమాచారం అందించాలని సూచించారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం – నేత్రదానం శ్రేష్ఠదానం అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. నేత్రదానం చేసిన వారి భౌతికకాయాన్ని ఖమ్మం పట్టణంలోని ఆసుపత్రుల నుంచి వారి స్వస్థలానికి తరలించేందుకు ఖమ్మం నేత్రనిధి ఆధ్వర్యంలో ఉచిత వ్యాన్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. అంతిమయాత్ర సమయంలో వైకుంఠధామం వరకు కూడా ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నేత్రదానం చేయదలచిన వారు లేదా నేత్రదానానికి సంబంధించిన వివరాల కోసం ఖమ్మం ఐ బ్యాంక్ సెల్ నంబర్లు 9397191919, 9247571995 నందు సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నేత్రదానంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేత్రదాన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, డిబిసిఎస్ డాక్టర్ బి. వెంకట నర్సయ్య, ఆప్తాలమిక్ సిబ్బంది ప్రవీణ్, నరేష్, కౌన్సిలర్ హరిప్రసాద్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విముక్తి జాతుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి గ్రేసమ్మ...**

**విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రతలో సమాన అవకాశాలు కల్పించాలి.**

**విముక్తి జాతుల హక్కులను పరిరక్షిస్తూ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి.**

**యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించి స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలి.**

**ఖమ్మంలో ఘనంగా విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమం**

ప్రభాతవార్త గాంధీ చౌక్ ఆగస్టు 31.




వివక్షకు గురైన విముక్తి జాతుల అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఐ. గ్రేసమ్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ చారిత్రకంగా వివక్షకు గురైన విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు సమాజం కూడా తన వంతు బాధ్యతగా సహకరించాలని అన్నారు. విముక్తి జాతుల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విముక్తి జాతుల హక్కులను పరిరక్షి స్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన పెంచి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేసినప్పుడే విముక్తి జాతులు, సంచార, అర్ధ సంచార వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపు సోమరాజు, డాక్టర్ కె.వి. కృష్ణారావు, దేరంగుల బ్రహ్మం, పొదిలి నరసింహ రావు, షేక్ మస్తాన్, పఠాన్ బడే ఖాన్, బత్తుల గోపాల్, ఒర్సు కృష్ణా, మల్లూరు కృష్ణయ్య, బాలేఘాట్ నరసింహ రావు, సిహెచ్ వెంకన్న, షేక్ ఉస్మాన్, ఎస్కె మస్తాన్, బి .నాగేశ్వరరావు, జి రాము, వి.ఉపేందర్, ఎస్కె షకీలా, చెల్లా మల్లాద్రి, బత్తుల నాగరాజు, కే సురేష్, వేముల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జీఓ 97 రద్దుచేయాల్సిందే..

**- పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు-విద్యార్థుల భారీ నిరసన**

**స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 31 ప్రభాతవార్త :**

జీవో 97ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు భారీనిరసన చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆందోళనలో పెద్దసంఖ్యలో పాల్గొన్న వారు జీవో 97కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో 97అమలుతో పాలిటెక్నిక్ విద్యారంగంపై, ముఖ్యంగా విద్యార్థుల విద్యాభ్యాసం, భవిష్యత్తు అవకాశాలపై ప్రభావంపడే అవకాశం ఉందని నిరసనకారులు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యసాంకేతిక విద్యలో కీలకమైన భాగమని, ఈ రంగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జీవో 97పై ప్రభుత్వం సమగ్రంగా పునఃపరిశీలన చేసి, దానివల్ల కలిగే పరిణామాలను అంచనా వేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ తమవిద్య, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలను ఏకపక్షంగా అమలు చేయకుండా ప్రభుత్వం తమసమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం అధ్యాపకులు, విద్యార్థులతో చర్చలు జరిపిసమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జీవో 97రద్దుఅయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని అధ్యాపకులు, విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# ప్రజావాణిలో 19దరఖాస్తుల స్వీకరణ

**నర్మెట, ఆగస్టు 31 ప్రభాతవార్త :**



నర్మెట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 19దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో రెవెన్యూ సంబంధించిన రెండు గృహనిర్మాణం సంబంధించినవి 14ఎంపీడీవోకు సంబంధించిన మూడువచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉప్పు గళ్ళ సంపత్‌కుమార్, ఎంఈఓ మడిపెల్లి ఐలయ్య, ఏవో బుర్ర మమత, ఏపీవో రమాదేవి, ఏపిఎం ప్రమీల, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సాగునీటి కష్టాలు తీర్చడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**తరిగొప్పుల, ఆగస్టు 31 ప్రభాతవార్త :**

రైతుల సాగునీటి కష్టాలు తీర్చడమే తమ లక్ష్యమని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తరిగొప్పుల మండలంలోని బొంతగట్టు నాగారం, బొత్తలపర్రె, జాలుబాయి తండా, బోజ్యతండా, కొత్త తండా, వాచ్యతండా, అంకుశపురం, సోలిపురం, అక్కరాజుపల్లి గ్రామాల్లో వీవో భవనాల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తుగడ్డ ప్రాంతాలైన బొత్తలపర్రె, జాలుబాయి తండాలకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి కావచ్చాయని, పైప్‌లైన్, మోటార్లు, విద్యుత్ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, పనులు వేగవంతంచేసి, దసరా నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. అర్హులైన పేదలందరికీ అవినీతి లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లుమంజూరు చేసి, మొదటి రెండువిడతలు కాకుండా మిగిలిన అర్హులకు 3, 4విడతల్లో ఇళ్లువచ్చేలా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లోరోడ్లు, మౌళికవసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేస్తానని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు ద్వారా పేదలకు ఉచితవైద్యం అందించిందని, ఎవరికైనా కంటిచూపు ఇబ్బందులు ఉంటే తన స్వంతగా వైద్యంఅందించి అద్దాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్ మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరులింగం, బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుర్రె మల్లయ్య, సర్పంచ్‌లు భూక్య రవి నాయక్, అల్వతి, బైకని రమ బాలరాజుయాదవ్, దండెం శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగపూరి కిషన్, నాయకులు ఏడెల్లి శ్రీనివాస్ రెడ్డి, జొన్నగోని సుదర్శన్, భూక్య జుంలాల్, చెన్నూరి సంజీవ, ప్రభు దాస్, రాజేశ్వర్, రామరాజు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నారాయణపురం గ్రామకాంగ్రెస్ నూతన కమిటీ ఏకగ్రీవం

**బచ్చన్నపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త :**

బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ నూతన గ్రామకార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మాసుద్, నారాయణపురం సర్పంచ్ పరిదే స్వప్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనకమిటీ ఎన్నిక జరిగింది. గ్రామస్థాయిలో కాంగ్రెస్‌పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. అధ్యక్షులుగా బండ్ల ఉపాచారి, ఉపాధ్యక్షులుగా జంగిటి సురేష్‌కుమార్, కాంద్రాజు మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల చిన్నరాములు, కోశాధికారిగా కొండం పరశురాములు, కార్యదర్శులుగా జంగిటి లక్ష్మయ్య, పుచ్చుల కనకయ్య, మాసపేట అంజిరెడ్డి, పరిదే చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులుగా ఇండ్ల నర్సింహులు, జంగిటి సుధాకర్, గోలన గౌరయ్య, పాల్గొన్నారు.